

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

## సంస్థాగత నిర్మాణంపై ఫోకస్

- నేడు పార్లమెంటరీ నేతలతో వర్క్‌షాప్

- పాల్గొననున్న చంద్రబాబు, లోకేష్

5

# అమరావతికి మువ్వన్నెల శోభ

తొలిసారిగా రాజధాని అమరావ తిలో గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పరేడ్‌ను పరిశీ లించి తన సందేశాన్ని అందించారు. పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు, ఉప ముఖ్య మంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ దంపతులు, మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలు రూపొందించిన శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకు న్నాయి. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంగా ఆం ధ్రప్రదేశ్ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ వెల్లడించారు. సుపరి పాలనకు 10 సూత్రాల ఆధారంగా సాధించిన పురోగతిని, రాష్ట్ర దిశను, గమ్యాన్ని నిర్వచిస్తున్న విజయాలు గర్వకారణమని అభి వర్ణించారు. రాజధానిలో గణతంత్ర వేడుకలు చరిత్రాత్మకమని అభివర్ణించారు. తొలిసారిగా ప్రజల రాజధాని అమరావతిలో జాతీ య జెండాను ఎగురవేస్తున్నామని ఉద్ఘాటించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలే- ప్రగతికి నిజమైన శిల్పులని పేర్కొన్నారు





- తొలిసారి రాజధానిలో గణతంత్ర వేడుకలు
- పాల్గొన్న సీఎం చంద్రబాబు, గవర్నర్ నజీర్
- కవాతులో ఆర్మీ కంటింజెంట్‌కు మొదటిస్థానం
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు, శకటాలు
- 10 సూత్రాలతో విజయ ప్రయాణం
- సాంకేతికతో పాలనతో కొత్త పుంతలు
- ప్రజలనుద్దేశించి గవర్నర్ ప్రసంగం

2





## గేమ్ ఛేంజర్ 'యువగళం'

8

**చారిత్రాత్మక పాదయాత్రకు మూడేళ్లు..**

**వైసీపీ అరాచక పాలనపై సమరశంఖం**

**యువనేత ఉక్కు సంకల్పానికి జన నీరాజనం**

**20 లక్షల ఉద్యోగాల కల్పనకు ప్రేరణ అదే**

ప్రజల ఆశలు, ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ ప్రజాచైతన్యమే లక్ష్యంగా యువనేత నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర కు బుధవారంతో మూడేళ్లు. జగన్‌రెడ్డి అరాచక పాలనపై సమర శంఖం పూరించిన లోకేష్ రాష్ట్ర రాజకీయాలను సమూలంగా మార్చేశారు. 2023 జనవరి 27న కుప్పం నుంచి ప్రారంభమైన పాదయాత్ర 3,132 కి.మీ మేర కొనసాగింది. ప్రజల కష్టాలు వింటూ.. కన్నీళ్లు తుడుస్తూ సాగిన పాదయాత్ర ప్రజల్లో చైతన్యం నింపింది. రాష్ట్ర భవిష్యత్తునే మార్చింది.

## ఇక డేటా డ్రివెన్ గవర్నన్

*ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు*



5

*2026 సంవత్సరం టెక్నాలజీ డ్రివెన్ డెసిషన్ మేకింగ్ ఇయర్‌గా మారాలి..పాలనలో టెక్నాలజీని విస్తృతంగా వినియో గించి క్షేత్రస్థాయి ఉద్యోగులపై పనిభారం తగ్గించాలి..సమర్థత లేకపోతే శిక్షణ ఇచ్చి ఫలితాలు రాబట్టాలని ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గనిర్దేశం చేశారు. ప్రభుత్వ సేవ ల్లోనూ ఏఐ పాత్ర పెరగాలని స్పష్టం చేశారు. ఇక డేటా డ్రివెన్ గవర్నెన్స్‌పై మరింత దృష్టి సారిస్తామని చెప్పారు.*

## ఆదర్శ నియోజకవర్గంగా మంగళగిరి



- కలిసికట్టుగా పనిచేద్దాం.. అభివృద్ధి చేసుకుందాం
- పరీక్షలు పెట్టే దేవుడు.. జయించే శక్తీ ఇస్తాడు
- ఏ పనిచేసినా సంకల్పం, పట్టుదల ముఖ్యం
- కష్టాల్లో ఉన్న తోటి వారికి అండగా నిలుద్దాం
- లూథరన్ చర్చి ప్రారంభోత్సవంలో మంత్రి లోకేష్

5

## సీఎం క్యాంప్ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు



గణతంత్ర దినోత్సవం సందర్భంగా సీఎం క్యాంప్ కార్యాల యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు జాతీయ జెండాను ఆవిష్కరిం చారు. గౌరవ వందనం స్వీకరించి భద్రతా సిబ్బంది, అధికారులకు స్వీట్లు పంచారు. గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## లోక్‌భవన్‌లో ఎట్ హెూమ్



రిపబ్లిక్ డే సందర్భంగా ఏపీ లోకభవన్‌లో ఎట్ హోం కార్యక్ర మం జరిగింది. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అతిథులకు ఆహ్వా నం పలికారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు నారా లోకేష్, పలువురు మంత్రులు పాల్గొన్నారు. గవర్నర్‌కు నేతలు రిపబ్లిక్ డే శుభాకాంక్షలు తెలిపారు.

చైతన్యరథం

# అమరావతికి మువ్వన్నెల శోభ

- తొలిసారి రాజధానిలో గణతంత్ర వేడుకలు
- పాల్గొన్న సీఎం చంద్రబాబు, గవర్నర్ నజీర్
- కవాతులో ఆర్మీ కంటింజెంట్‌కు మొదటిస్థానం
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు, శకటాలు









అమరావతి(చైతన్యరథం): తొలిసారిగా రాజధాని అమరావతిలో గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పరేడ్‌ను పరిశీ లించి తన సందేశాన్ని అందించారు. గౌరవ వందనం స్వీకరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ దంపతులు, మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.విజయానంద్, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, హైకోర్టు న్యాయమూర్తులు హాజరయ్యారు. వేడుకల్లో ఇండియన్ ఆర్మీ, కర్నూలు ఏపీఎస్పీ సెకండ్ బెటాలియన్, సీఆర్పీఎఫ్, కేరళ రాష్ట్ర పోలీస్, విశాఖపట్టణం ఏపీఎస్పీ 16వ బెటాలియన్, ఎన్సీసీ (బాయ్స్), ఎన్సీసీ (గరల్స్), ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ (బాయ్స్ అండ్ గరల్స్), భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ (బాయ్స్ అండ్ గరల్స్), యూత్ రెడ్ క్రాస్ (బాయ్స్) కంటింజెంట్స్ కవాతును నిర్వహించారు. కవాతులో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఇండియన్ ఆర్మీ కంటింజెంట్‌కు మొదటి స్థానం, విశాఖపట్టణం ఏపీఎస్పీ 16వ బెటాలియన్‌కు రెండో స్థానం, కాన్సులేషన్ ప్రైజ్‌గా కేరళ రాష్ట్ర పోలీస్ కంటింజెంట్‌కు అందించారు. పరేడ్‌లో ప్రధానంగా బ్రాస్ బ్యాండ్, పైప్ బ్యాండ్ ఆహుతులను అలరించాయి. పరేడ్‌కు మంగళగిరి ఏపీఎస్పీ బెటాలియన్ ఐజీపీ బీ.రాజకుమారి నోడల్ ఆఫీసర్‌గా, డీఐజీ కె.ఫకీరప్ప కోఆర్డినే టింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. పరేడ్ కమాండర్‌గా జంగారెడ్డి గూడెం ఏఎస్పీ పరేడ్ కమాండర్ ఆర్.సుస్మిత, పరేడ్ సెకండ్ ఇన్ కమాండ్ ఏపీఎస్పీ మొదటి ఐఆర్ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ టీ.ఎన్.శ్రీనివాసరావు, పరేడ్ అడ్జుటెంట్ కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్ ఎం.శివరామకృష్ణ వ్యవహరించారు. ఈ గణతంత్ర దినోత్సవ వేడుకలు రాష్ట్ర ఐక్యత, ప్రజాస్వామ్య విలువలను ప్రతిబింబిస్తూ ఘనంగా ముగిశాయి. పొలిటి కల్ ప్రిన్సిపల్ సెక్రటరీ జే.శ్యామలరావు, గుంటూరు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.





## ఆకట్టుకున్న శకటాలు..
## సాంస్కృతికానికి ప్రథమస్థానం

77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరావతి రాజధానిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వేడుకల్లో వివిధ ప్రభుత్వ శాఖలు రూపొందించిన శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలు, సాంస్కృతిక వారసత్వం, సామా జిక అవగాహన అంశాలను ప్రతిబింబించేలా రూపొందించిన శకటాలు కనువిందు చేశాయి. శకటాల్లో వందేమాతరం-150 సంవత్సరాల ఇతివృత్తంగా రూపొందించిన రాష్ట్ర సాంస్కృతిక శాఖ శకటానికి ప్రథమ, మహిళా సంక్షేమమే చంద్రన్న ధ్యేయంతో రూపొందిన సెర్ప్ శకటానికి ద్వితీయ, పెట్టుబడుల ద్వారా ఉపాధి ఇతివృత్తంగా రూపొందిన పరిశ్రమల శాఖ శకటానికి తృతీయ స్థానాల్లో నిలిచాయి. వీటితో పాటు జనాభా నిర్వహణ, మానవ వనరుల అభివృద్ధి, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, వైద్య విద్యా శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, నైపుణ్యం, ఉపాధి స్కిల్ డవలప్ మెంట్ కార్పొరేషన్, పాఠశాల విద్యాశాఖ, పర్యాటక శాఖ, జల వనరుల అభివృద్ధి శాఖ, మైక్రో ఇరిగేషన్, అటవీ శాఖలు, రైతు - వ్యవసాయ సాంకేతికతతో వ్యవసాయ శాఖ, మత్స్య శాఖలు, మౌలిక వసతులు పెట్టుబడులు, సముద్ర వైమానిక రంగాలు, సీఆర్డీఏలు, వ్యయ అత్యుత్తమీకరణ (ఖర్చు తగ్గింపు)-శక్తి, ఇంధ నం నెడ్‌క్యాప్ (ఇంధనం), ఉత్పత్తి పరిపూర్ణత, చేనేత, జౌళి శాఖ, ఉద్యానవన శాఖ, స్వచ్ఛ ఆంధ్ర, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ (స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్), పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, ఆర్టీజీఎస్ శాఖల శకటాలు ప్రభుత్వ సంకల్పం, ప్రజా సంక్షేమ లక్ష్యాలను స్పష్టంగా ఆవిష్కరించాయి. ఆధునిక సాంకేతికతతో పాటు సంప్రదాయ కళారూపాల మేళవింపుతో రూపొందిన శక టాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.











చైతన్యరథం





# లోక్‌భవన్‌లో ఎట్ హెూం కార్యక్రమం

రిపబ్లిక్ డే సందర్భంగా ఏపీ లోకభవన్‌లో ఎట్ హోం కార్యక్ర మం జరిగింది. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అతిథులకు ఆహ్వా నం పలికారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, సవిత, ఎమ్మెల్యేలు, ఎంపీలు, జడ్జీలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు నేతలు రిపబ్లిక్ డే శుభాకాంక్షలు తెలిపారు.















చైతన్యరథం








# లోక్‌భవన్‌లో లోకేష్..

లోక్‌భవన్‌లో ఎట్ హెూమ్ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ పాల్గొన్నారు. గవర్నర్ నజీర్ వారికి స్వాగతం పలి కారు. లోకేష్ నాయకులను పలకరిస్తూ ఉల్లాసంగా గడిపారు.













- టెక్నాలజీ డ్రివెన్ డెసిషన్ మేకింగ్ ఇయర్‌గా 2026
- అవసరమైతే ఉద్యోగులకు శిక్షణ ఇచ్చి పర్యవేక్షించాలి
- ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

# పాలనలో సాంకేతికతతో పనిభారం తగ్గించండి



అమరావతి(చైతన్యరథం): పాలనలో టెక్నాలజీని విస్తృతంగా వినియోగించి క్షేత్రస్థాయి ఉద్యోగులపై పని భారం తగ్గించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. సమర్థత లేకపోతే శిక్షణ ఇచ్చి నిరంతరం పర్యవేక్షించాలని..తద్వారా ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. సాంకేతికతతో గవర్నెన్స్ లో చాలా సమస్యలు పరిష్కరించవచ్చని, సాంకేతికతను ఉద్యోగులు, అధికారులు విస్తృతస్థాయిలో వినియోగించుకునేలా ప్రోత్సహించేలా కోరారు. 2026 సంవత్సరం టెక్నాలజీ డ్రివెన్ డిసిషన్ మేకింగ్ ఇయర్‌గా మారాలని, ప్రభుత్వ సేవల్లోనూ ఏఐ పాత్ర పెరగాలని స్పష్టం చేశారు. ఏఐ వినియోగించుకుని గ్రీవెన్సులు సత్వరంగా పరిష్కరించాలని నిర్దేశించారు. క్యాంపు కార్యాలయంలో ఆర్టీజీఎస్‌పై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి... ఇక డేటా డ్రివెన్ గవర్నెన్స్‌పై మరింత దృష్టి సారిస్తామని చెప్పారు. మన మిత్ర - వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ప్రస్తుతం 878 ప్రభుత్వ సేవలను అందించగలుగుతున్నట్టు... ఇప్పటివరకు 1.43 కోట్ల మంది ఈ సేవలను వినియోగించుకున్నారని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం వైద్యం, వ్యవసాయం, రెవెన్యూ, రహ దారులు, ఆర్టీఏ, అగ్నిమాపక శాఖల పనితీరుపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించారు.

## సంస్థాగత నిర్మాణంపై ఫోకస్

- నేడు పార్లమెంటరీ నేతలతో వర్క్‌షాప్
- పాల్గొననున్న సీఎం చంద్రబాబు, లోకేష్



అమరావతి(చైతన్యరథం): అధికార తెలుగుదేశం పార్టీ తన సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేసే దిశగా అడుగులు వేస్తోంది. జిల్లా కమిటీలు పూర్తి కావడంతో రాష్ట్ర కమిటీ ఎంపి కపై దృష్టిపెట్టింది. మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం 25 పార్లమెంటరీ నియోజకవర్గాల నేతలతో సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ భారీ వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. నాయ కత్వ పటిష్టత, పార్టీ బలోపేతమే ఈ సమావేశం ప్రధాన అజెండా గా తెలుస్తోంది. ఈ కార్యక్రమం టీడీపీ భవిష్యత్ వ్యూహాలకు దిశా నిర్దేశం చేయనుంది. 2024 ఎన్నికల విజయం తర్వాత ప్రభుత్వ పాలనతో పాటు పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపేందుకు కసరత్తు చేస్తున్నారు. మరోవైపు జిల్లా కమిటీల ప్రక్రియ ముగియ డంతో ఇప్పుడు అందరి దృష్టి రాష్ట్ర కమిటీ వైపు మళ్లింది. రాష్ట్ర కమిటీలో కీలక బాధ్యతలను ఎవరికి అప్పగించాలనే అంశంపై సుదీర్ఘంగా చర్చిస్తున్నారు. టీడీపీ చరిత్రలో జిల్లా కార్యవర్గాలకు నిర్వహించే ఈ వర్క్‌షాప్ అత్యంత కీలకంగా మారింది. ఈ వర్క్‌షాప్‌లో 25 పార్లమెంటరీ నియోజకవర్గాలకు చెందిన పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కీలక నేతలకు ఇప్పటికే అధికా రిక ఆహ్వానాలు అందాయి. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నారా లోకేష్ టీడీపీ కార్యాలయంలోనే శ్రేణులకు అందుబాటులో ఉండనున్నారు. ఆయా జిల్లాల నేతలతో యువనేత వ్యక్తిగతంగా మాట్లాడే అవకాశం ఉంది.

# దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా మంగళగిరి

- కలిసికట్టుగా పనిచేద్దాం.. అభివృద్ధి చేసుకుందాం
- పరీక్షలు పెట్టే దేవుడు.. జయించే శక్తీ ఇస్తాడు
- ఏ పనిచేసినా సంకల్పం, పట్టుదల ముఖ్యం
- కష్టాల్లో ఉన్న తోటి వారికి అండగా నిలుద్దాం
- లూథరన్ చర్చి ప్రారంభోత్సవంలో మంత్రి లోకేష్







మంగళగిరి(చైతన్యరథం): అందరం కలిసికట్టుగా పనిచేస్తే దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా మంగళగిరి రూపుదిద్దుకుం టుందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరి పట్టణం ఆత్మకూరులో ఆంధ్ర ఇవాంజిలికల్ లూథరన్ సంఘం, ఆత్మకూరు ప్యారిష్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన లూథరన్ చర్చి ప్రతిష్ఠ మహోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నా రు. రిబ్బన్ కట్ చేసి నూతన చర్చిని ప్రారంభించారు. శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. లూథరన్ చర్చి ప్రతిష్ట మహోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కను నాటారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ ఎవరూ ఊహించని విధంగా మన మందిరాన్ని పునర్నిర్మించుకోవడం జరిగింది. ఈ మందిరం పునర్నిర్మాణంలో భాగస్వామ్యం అయ్యే అవకాశం దేవుడు కల్పించాడు. నేను ఎన్నోసార్లు మన గ్రామానికి వచ్చినా, చర్చికి వచ్చినా, దేవాలయానికి వచ్చినా ఒక్కటే చెబుతాను. దేవుడు మనకు పరీక్షలు పెడతాడు. ఆ పరీక్షలు జయించే శక్తి కూడా దేవుడు మనకు ఇస్తాడు. కష్టాల్లో ఉన్న మన తోటివారిని ఆదుకోవాల్సిన అవసరం ఉంది. ఈ రోజు సమాజాన్ని చూస్తే.. చిన్న, చిన్న విష యాలకే ఆందోళన చెందుతున్నారు. పరీక్షల్లో తక్కువ మార్కులు వస్తే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దేవుడు పరీక్ష పెడితే.. సంకల్పంతో జయించాలి. 2019లో మంగళగిరి నుంచి పోటీచేసి ఓటమి పాలయ్యాను. అయినా నేను భయపడలేదు. కసితో పని చేసి ప్రజలకు దగ్గరయ్యాను. అందరం కలిసికట్టుగా పనిచేస్తే మన గ్రామాన్ని, నియోజక వర్గాన్ని దేవుడి ఆశీస్సులతో దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుకోగలుగుతాం. మంగళ గిరిని కలిసిక ట్టుగా అభివృద్ధి చేసుకుందాం. కులాలు వేరైనా, మతాలు వేరైనా అందరం కలిసికట్టుగా ముందుకు వెళదామని, కష్టాలను కలిసిక ట్టుగా ఎదుర్కొందామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, గుంటూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, ఏపీఐఐసీ డైరెక్టర్ కనికళ్ల చిరంజీవి, రెవరెండ్ డాక్టర్ కొడాలి విజయ్, కేరళ రిటైర్డ్ సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి, ఏఈఎల్సీ అడ్మినిస్ట్రేటర్ పి.యస్ జోసఫ్, ఏఈఎల్సీ మాజీ మధ్యమ గుంటూరు సినడ్ బిషప్, రైట్.రెవరెండ్ డాక్టర్ ఎస్.జే.బాబూరావు, రెవరెండ్ జే.ఏసురత్నంతో పాటు సంఘ పెద్దలు, పాస్టర్లు, పెద్దఎత్తున క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు. అనంతరం అందరితో కలిసి ఫొటోలు దిగారు.

### కొమ్మా సుకుమార్‌కు లోకేష్ పరామర్శ

ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకుంటున్న మంగళగిరి మండల పార్టీ ఉపాధ్యక్షుడు కొమ్మా సుకుమార్‌ను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పరామర్శిం చారు. ఆత్మకూరులో నూతన చర్చి ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం సుకుమార్ కుటుంబ సభ్యులతో మంత్రి లోకేష్ ప్రత్యేకంగా మాట్లాడారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య పరిస్థితిని వాకబు చేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.





# ప్రగతిరథ చక్రాలు

## గణతంత్ర వేడుకల్లో ఆకట్టుకున్న శకటాలు

అమరావతిలోని నేలపాడు పరేడ్ గ్రౌండ్‌లో గణతంత్ర వేడు కలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ జెండా ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారాలోకేశ్, మంత్రులు హాజరయ్యారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ ప్రదర్శించిన శకటాలు ఆకట్టుకున్నాయి.































## 'గుండ' కాంస్య విగ్రహ ఏర్పాటుకు చర్యలు

**సూర్యనారాయణ కుమారులకు సీఎం హామీ**



అమరావతి(చైతన్యరథం): దివంగత మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ కుటుంబానికి టీడీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. మంగళగిరిలో గుండ కుమారులు శివగంగాధర్, విశ్వనాథ్ సోమవారం సీఎంను కలిసి తమ తండ్రి అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. విదేశీ పర్యటన వల్ల తాను అంత్యక్రియలకు రాలేకపోయానని సీఎం విచారం వ్యక్తం చేశారు. తండ్రి ఆశయ సాధన కోసం తాము స్థానికంగానే ఉంటామని వారు చెప్పగా సీఎం హర్షం వ్యక్తం చేశారు. కాగా గుండ కాంస్య విగ్రహ ఏర్పాటు చేయాలని వారు వినతిపత్రం అందించగా ప్రభుత్వపరంగా తగు చర్యలు తీసుకుంటామని చంద్రబాబు హామీ ఇచ్చారు.

## విజయవాడకు కేంద్ర కార్మిక మంత్రి

**- 3వ ప్రాంతీయ సదస్సులో పాల్గొనేందుకు రాక**

**- ఘనస్వాగతం పలికిన వాసంశెట్టి సుభాష్**

విజయవాడ(చైతన్యరథం): కార్మిక చట్టాలు, ఇతర కీలక అంశాలపై రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలతో నిర్వహిస్తున్న 3వ ప్రాంతీయ సదస్సులో పాల్గొనేందుకు విజయవాడకు వచ్చిన కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి శోభ కరన్ దల్జేను నోవాటెల్ వద్ద రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కార్మికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శేషగిరిబాబు, లేబర్ కమిషనర్ గంధం చంద్రుడుతోపాటు శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న కార్మిక సంస్కరణలు, కొత్త కార్మిక చట్టాల అమలు విధానం, కార్మికుల సంక్షేమం, పరిశ్రమల అభివృద్ధి, రాష్ట్ర-కేంద్ర సమన్వయంపై ఈ ప్రాంతీయ సదస్సు కీలకంగా నిలుస్తుందని మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. కార్మికుల హక్కుల పరిరక్షణతో పాటు ఉపాధి అవకాశాల పెంపు దిశగా కేంద్రం, రాష్ట్రం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.



కేంద్ర మంత్రి శోభ కరన్ దల్జే సదస్సు విజయవంతంగా నిర్వ హించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అభినందిస్తూ కార్మిక సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మధ్య కార్మిక విధానా లపై సమన్వయం మరింత బలోపేతం అవుతుందని అధికారులు తెలిపారు.

# ఖరీఫ్ నాటికి వెలిగొండ ప్రాజెక్టు పూర్తి

- ప్రాజెక్టుపై జగన్‌రెడ్డివి కట్టుకథలు, విష ప్రచారాలు
- పూర్తి చేయకుండానే క్రెడిట్ డ్రామాలు
- చుక్కనీరు పారించకుండా జాతికి అంకితం చేసిన అజ్ఞాని
- ఆయన క్రిమినల్ క్రెడిట్‌ను ఎవ్వరూ చోరీ చేయలేరు
- కూటమి పాలనలో ప్రణాళికాబద్ధంగా ప్రాజెక్టులు



నవ్యాంధ్రలో సాగునీటి ప్రాజెక్టులకు అత్యధిక ప్రాధాన్యతను ఇచ్చిన సీఎం చంద్రబాబు దాదాపు రూ.7 లక్షల కోట్ల బడ్జెట్‌లో రూ.72వేల కోట్లు ప్రాజెక్టుల నిర్మాణానికి ఖర్చు చేశారు. అందులో భాగంగానే ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల వరప్రదాయని అయిన పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్‌ను జూన్ నాటికి పూర్తి చేసి ఆయకట్టు రైతుకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో కూట మి ప్రభుత్వం పనిచేస్తుంది. అందులో భాగంగానే ఈ 18 నెలల పాలనలో రూ.1,039 కోట్లు ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి కేటాయించి ఖర్చు చేసింది. 2014-19 మధ్య కాలంలో దాదాపు రూ.1,500 కోట్లు ఖర్చు చేసి టన్నెల్ 1 17.80 కి.మీ. పూర్తి చేసి టన్నెల్ 2 పనులు పూర్తి చేసేందుకు నిధులు కేటాయించారు. దాదాపు వెలి గొండ ప్రాజెక్టు పనుల్లో 80 శాతం పనులు చంద్రబాబు పాలన హయాంలోనే జరిగాయి. టీడీపీ హయాంలో మొదటి, రెండో సొరంగాల పనులు నిబంధనల మేరకు టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం)తో తవ్వి వ్యర్ధాలను కన్వేయర్ బెల్ట్ ద్వారా బయటకు పంపారు. సెగ్మెంట్లతో లైనింగ్ చేశారు. ప్రస్తుతం మరో రూ.2 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉండగా.. అందులో నిర్వాసితులకు రూ.886 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది.

### నీరు పారించకుండానే ప్రాజెక్టును జాతికి అంకితం చేసిన జగన్‌రెడ్డి

చంద్రబాబుహయాంలో 80శాతానికి పైగా పనులు పూర్తిచేసుకున్న వెలిగొండ ప్రాజెక్ట్‌ను.. 2019-2024 మధ్య కాలంలో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి గాలి కొదిలేశాడు. జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో రూ.3 వేల కోట్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేసి కేవలం రూ.170కోట్లు మాత్రమే ఖర్చుచేశారు. చంద్రబాబు ప్రభుత్వం తెచ్చిన జీఓ 40ను, జీఓ 50పేరుతో రూ.1,099.40 కోట్లకు సవరించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మొదటి టన్నెల్ ఒక కిలో మీటరు పనులు మాత్రమే చేసింది. రెండో సొరంగంలో నిబంధనలకు విరుద్ధంగా పేలుళ్లు చేపట్టి మాన్యువల్‌గా పనులు చేశారు. ఆ మట్టిని బయటకు తెచ్చేందుకు రెండు, మూడు చోట్ల టన్నెల్ 2 నుంచి టన్నెల్ 1లోకి భారీ రంధ్రాలను పెట్టారు. మరోవైపు ఫీడర్ కాలువలో చాలా చోట్ల స్ట్రక్చర్లు పెండింగ్‌లో ఉండగా,అనేకచోట్ల మట్టి కట్టలు కోతకు గురై లైనింగ్ చేయాల్సి ఉంది. వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి ఇంకా ఫీడర్ కాలువ లైనింగ్, కొన్నిచోట్ల వంతెనల నిర్మాణం చేయాల్సి ఉంది. తూర్పు ప్రధాన కాలువ, తీగలేరు కాలువ పనులు, వంతెనలు, హెడ్ రెగ్యులేటర్ అసంపూర్తి గానే ఉన్నాయి. నల్లమల సాగర్ పరిధిలో ముంపు గ్రామాలను ఇంకా ఖాళీ చేయించలేదు. సుమారు 7,555 మంది నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ రూ.1,400 కోట్లు ఇవ్వాల్సి ఉండగా ఒక్కరికీ అందజేయలేదు.

### ఇదీ మీ క్రిమినల్ క్రెడిట్..

తండ్రి శవంతో రాజకీయం చేయడం, కోడి కత్తి డ్రామా, బాబాయ్‌ను చంపేసి అధికారంలోకి రావడం, తల్లి, చెల్లిని గెంటేయడం, సొంత చెల్లి చీరపై వ్యాఖ్యలు చేయడం, దళితుల శవాలతో శవ రాజకీయం చేయడం ఇది నీ క్రెడిట్. నీ క్రెడిట్ ఏమిటో తెలుగు ప్రజలకు తెలుసు కాబట్టే 11 సీట్లకు పరిమితం చేశారు. ఇసుక అక్రమ సంపాదన కోసం అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి 39 మంది ప్రాణాలు తీసింది నీ క్రెడిట్. తుంగభద్ర, పులిచింతల, ఎర్రకాలువ, పింఛా డ్యామ్ దెబ్బతిన్నా పట్టించుకోకపోవడం నీ క్రెడిట్. అధికారంలోకి రాగానే ప్రాజెక్టును పూర్తి చేస్తానని ప్రగ ల్భాలు పలికి ఐదేళ్ల పాటు మొద్దు నిద్రపోయిన జగన్‌రెడ్డి నేడు వెలిగొండ ప్రాజెక్టు గురించి మాట్లాడటం హాస్యాస్పదం.

### ప్రాజెక్టు పూర్తయితే లక్షల ఎకరాలకు సాగు

కృష్ణా జలాలను ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు తరలిం చాలనే సంకల్పంతో 1996 మార్చి 5న సీఎం చంద్రబాబు పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ పనులకు పునాది వేశారు. శ్రీశైలం రిజర్వాయర్ ఫోర్ షోర్ కుడిగట్టు ద్వారా గ్రావిటీతో కృష్ణా నది నుంచి 43.50 టీఎంసీల వరద జలాలను వినియోగించుకొని ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లో 4.47 లక్షల ఎకరాలకు సాగు నీటికి ఉపయోగించుకున్నారు. అలాగే 30 ఫ్లోరైడ్ ప్రభావిత మండలాలలోని 15.25 లక్షల మందికి తాగునీరు అందించడం ముఖ్య ఉద్దేశం. ఈ ప్రాజెక్టులో భాగంగా కృష్ణా నది వరద జలాల ను ముందుగా 200 మీటర్ల అప్రోచ్ కాలువతో పారిస్తారు. అక్కడి నుంచి 18.8 కి.మీ. పొడవున రెండు భారీ సొరంగాలను తవ్వా రు. ఆసియాలోనే అతిపెద్ద సాగునీటి సొరంగాలుగా ఇవి పేరొం దాయి. దోర్నాల-కర్నూలు మార్గంలోని కొత్తూరు వరకు తవ్విన ఈ రెండు టన్నెళ్ల ద్వారా రోజుకు ఒక టీఎంసీ నీటిని తరలిం చొచ్చు. కొత్తూరు నుంచి సుమారు 22 కి.మీ. దూరంలో ఉన్న 'నల్లమల సాగర్'కు కాలువ ద్వారా నీటిని తరలిస్తారు. ఈ జలాశ యం నుంచి ఐదు ప్రధాన కాల్వల ద్వారా నిర్దేశిత ప్రాంతాలకు నీటిని అందిస్తారు. ఈ ప్రాజెక్టుకు టీడీపీ ప్రభుత్వం ఇప్పటివరకు రూ.2,600 కోట్ల వరకు ఖర్చు చేసింది. మరో రూ.2 వేల కోట్లు ఖర్చు చేయబోతున్నారు.

### వెలిగొండ ప్రాజెక్టులో నల్లమల సాగర్ కీలకం

ప్రకాశం జిల్లాలోని నల్లమల పర్వత శ్రేణులకు సమాంతరంగా, వెలుపల ఉన్న కొండలను వెలుగొండలు అని పిలుస్తారు. ఈ వెలు గొండ కొండల శ్రేణిలోని సుంకేసుల, గొట్టిపడియ, కాకర్ల వద్ద కొండల మధ్య ఖాళీలను కలుపుతూ... గోడల తరహాలో ఆనకట్ట లు కట్టడంతో 43.50 టీఎంసీల సామర్థ్యంతో సహజమైన నల్ల మల సాగర్ రిజర్వాయర్‌ను ఏర్పాటైంది. ఈ రిజర్వాయర్‌లో 10.35 టీఎంసీలు డెడ్ స్టోరేజీ కాగా... 38.57 టీఎంసీలను పంటల సాగుకు, 1.57 టీఎంసీలను తాగునీటి కోసం వినియోగిస్తారు. 3.37 టీఎంసీల నీటిని ఆవిరి రూపంలో నష్టపోతామని అంచనా. వెలిగొండ ప్రాజెక్టులో భాగంగా నల్లమలసాగర్ జలాశ యంలో నీళ్లు నింపేందుకు వీలుగా వెలిగొండ టన్నెళ్ల నుంచి నీళ్లు తీసుకువెళ్లే కాలువల్లో అవసరమైన పనులు చేసేందుకు రూ.106.39 కోట్లతో పాలనామోదం ఇచ్చారు. ఇందులో భాగంగా ఫీడర్ కాలువ, తీగలేరు కాలువల్లో మిగిలిపోయిన ప్రధాన పనులు 2022-23 ధరలతోనే చేపట్టేందుకు మేఘా కంపెనీకి అప్పగిస్తూ ఆదేశాలు ఇచ్చారు. రూ.53.44 కోట్ల విలువైన పనులు వారికి అప్పగించారు. మరో రూ.29.38 కోట్ల విలువైన పనులు ఎస్సీఎల్ కంపెనీకి అప్పగిస్తూ ఆదేశాలు ఇచ్చారు. ఖరీఫ్ నాటికి రైతులకు నీరు అందించే లక్ష్యంతో పనులు జరుగుతున్నాయి.

### నల్లమల సాగర్‌కు గోదావరి వరద జలాలు

ఏటా సముద్రంలో కలిసే గోదావరి వరద జలాలు 200 టీఎంసీల నీటిని బొల్లాపల్లి రిజర్వాయర్ ద్వారా నల్లమల సాగర్ కు తరలించేలా సీఎం చంద్రబాబు ప్రణాళికలు రచించారు. పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.58 వేల కోట్లు ఖర్చవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. మొదట్లో భావించినట్లు 3 సెగ్మెంట్లలోనే పనులు చేస్తారు. మూడో సెగ్మెం ట్లో గతంలో అనుకున్నట్లు బొల్లాపల్లి జలాశయం నుంచి బనక చర్ల వరకు కాకుండా బొల్లాపల్లి నుంచి నల్లమలసాగర్ జలాశయం వరకే పరిమితమవుతుంది. ఇందుకు రూ.9,000 కోట్లు ఖర్చవుతుందని లెక్కలు వేశారు నీటిని కూడా మరీ ఎత్తుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉండబోదు. 250 మీటర్ల వరకు ఎత్తిపోస్తే సరిపోతుంది. తొలి సెగ్మెంట్(పోలవరం- ప్రకాశం బ్యారేజీ)కు రూ.13 వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా. రెండో సెగ్మెంట్(ప్రకాశం బ్యారేజీ - బొల్లాపల్లి)లో బొల్లాపల్లిలో రిజర్వాయర్ నిర్మించి అక్కడికి నీళ్లు పంపిస్తారు.

ఈ విభాగంలో రూ.36 వేల కోట్ల వరకు ఖర్చవుతుంది. గోదా వరి నల్లమల సాగర్ ప్రాజెక్టు పూర్తయితే ఏటా 200 టీఎంసీల నీరు ప్రకాశం, నెల్లూరు జిల్లాలతో పాటు రాయలసీమ ప్రాంత రైతాంగానికి తాగు, సాగునీటికి ఉపయోగకరంగా ఉంటుంది. విజన్ 2047 నదుల అనుసంధానంలో భాగంగా సీఎం చంద్ర బాబు గోదావరి నల్లమల సాగర్ ప్రాజెక్టుకు కార్యరూపం దాల్చారు. రాబోయే రోజుల్లో ప్రతి జిల్లా పచ్చబడేలా ప్రణాళి కలు రచిస్తూ, పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేసి అటు వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు గోదా వరి జలాలు అందించి, సాగునీటి ఇబ్బంది లేకుండా చేయాలన్న దృఢ సంకల్పంతో పనిచేస్తున్నారు.

**- ప్రవీణ్ బోయ, అనలిస్ట్**

## రాష్ట్ర రాజకీయాల్లో

# గేమ్ ఛేంజర్ 'యువగళం'

- చారిత్రాత్మక పాదయాత్రకు మూడేళ్లు..
- వైసీపీ అరాచక పాలనపై సమరశంఖం
- యువనేత ఉక్కు సంకల్పానికి జన నీరాజనం



అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో కోట్లాది ప్రజల ఆశలు, ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ ప్రజాచైతన్యమే లక్ష్యంగా యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్ర చేపట్టి మూడేళ్లు పూర్తయింది. జగన్మోహన్‌రెడ్డి అరాచక పాలనపై యువగళం పాదయాత్ర ద్వారా సమరశంఖం పూరించిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ రాష్ట్ర రాజకీయాలను సమూలంగా మార్చే శారు. 2023 జనవరి 27వ తేదీన కుప్పం శ్రీ వరదరాజస్వామి పాదాలచెంత ప్రారంభమైన యువగళం పాదయాత్ర 11 ఉమ్మడి జిల్లాల్లో 97 అసెంబ్లీ నియోజకవర్గాలు, 232 మండలాలు/ మున్సిపాలిటీలు, 2,097 గ్రామాల మీదుగా 226 రోజులపాటు 3,132 కి.మీ మేర కొనసాగింది. యువగళం పాదయాత్ర నిర్వహించిన 97 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 90 చోట్ల కూటమి అభ్యర్థులు విజయదుందుభి మోగించారు. ఉద్యోగాల్లేక నిరాశ, నిస్పృహలతో ఉన్న యువత ఒకవైపు... భద్రత కరువైన మహిళలు మరోవైపు, అడ్డగోలు బాదుడుతో బతుకుభారంగా మారిన జన సామాన్యం ఇంకోవైపు.. వీరందరికీ నేనున్నానంటూ భరోసా ఇచ్చా రు యువనేత లోకేష్. ప్రజల కష్టాలు వింటూ.. కన్నీళ్లు తుడుస్తూ సాగిన యువగళం పాదయాత్ర ప్రజల్లో చైతన్యం నింపింది.

### కోటిన్నర మందిని నేరుగా కలిసిన యువనేత

యువగళం పాదయాత్ర జగన్మోహన్‌రెడ్డి మాదిరి శని, ఆదివారాల్లో వీక్లీ ఆఫ్‌లతో ఆషామాషీగా ముందుకు సాగలేదు. పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అరెస్టు, తారకరత్న మరణం వంటి అనివార్యమైన పరిస్థితుల్లో మినహా ఎటువంటి విరామం లేకుండా నారా లోకేష్ పాదయాత్ర సాగింది. రాయలసీమలో 48 డిగ్రీల మండుటెండల్లో సైతం యువగళం ఆగలేదు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో జోరువర్షంలో సైతం యాత్రను కొనసాగించారు. పాదయాత్ర నంద్యాల చేరుకున్న సమయంలో అభిమానుల తాకిడి కి గాయపడి చేయినొప్పితో బాధపడుతున్న సమయంలో కొద్ది రోజులు విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్లు చెప్పినా యువనేత లెక్క చేయలేదు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా ఉక్కుసంకల్పంతో నడక ఆపలేదు. యువగళం పాదయాత్రలో యువనేత లోకేష్ 70 బహిరంగ సభలు, 155 ముఖాముఖి సమావేశాలు, 12 ప్రత్యేక కార్యక్రమాలు, 8 రచ్చబండ కార్యక్రమాల్లో పాల్గొని ప్రజా సమస్య లను తెలుసుకున్నారు. ప్రజల నుంచి రాతపూర్వకంగా 4,353 వినతిపత్రాలు అందగా, 226 రోజుల సుదీర్ఘ పాదయాత్రలో కోటిన్నరమందికి పైగా ప్రజలు నేరుగా యువనేతను కలుసుకుని తమ కష్టాలు చెప్పుకున్నారు.

### రాయలసీమ ప్రేమ

గతంలో ఏ నాయకుడు చేయని విధంగా రాయలసీమలో సుదీర్ఘ పాదయాత్రతో యువనేత లోకేష్ రికార్డు సృష్టించారు. 124 రోజుల పాటు 44 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా 1,587 కి.మీ మేర సీమలో యువగళం పాదయాత్ర కొనసాగింది. అనుక్షణం ప్రజల్లో మమేకమవుతూ యువనేత పాదయాత్ర సాగిం ది. రాయలసీమలో యువగళానికి లభించిన అపూర్వస్పందన నాటి అధికార పార్టీ పెద్దలకు కంటిమీద కునుకు లేకుండా చేసింది. పాదయాత్రను అడ్డుకునేందుకు అధికార పార్టీ అన్ని ప్రయత్నాలు చేసింది. ఉక్కుసంకల్పంతో సాగిన యువగళాన్ని అడ్డుకోవడం వారి తరం కాలేదు.

### దక్షిణకోస్తా దద్దరిలిల్లింది

ఉమ్మడి నెల్లూరు జిల్లాల్లోని 10 అసెంబ్లీ నియోజకవర్గాలను కవర్ చేస్తూ 31రోజులపాటు 459 కి.మీ యువగళం పాదయాత్ర జనసంద్రంలా సాగింది. ప్రకాశం జిల్లాలో 8 అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో 17 రోజుల పాటు 220 కి.మీ, గుంటూరు జిల్లాలో 7 నియోజకవర్గాల పరిధిలో 16 రోజుల పాటు 236 కి.మీ.లు, కృష్ణా జిల్లాలో 6 నియోజకవర్గాల్లో 8 రోజులపాటు 113 కి.మీ మేర యువగళం పాదయాత్ర కొనసాగింది. విజయ వాడ నగరంలో తెల్లవారుజామున 4.30 గంటల వరకు కూడా ప్రజలు యువనేత కోసం రోడ్ల వెంట వేచిచూశారు.

### గోదావరి ఉప్పొంగింది

ఉభయగోదావరి జిల్లాల్లో 17 నియోజకవర్గాల పరిధిలో 23 రోజులపాటు సాగిన యువగళం పాదయాత్ర జనజాతరను తలపించింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 8 నియోజక వర్గాలు, 11 రోజులు, 225.5 కి.మీలు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 9 (రాజోలు, పి.గన్నవరం, అమలాపురం, ముమ్మిడివరం, కాకినాడ రూరల్, కాకినాడ సిటీ, పెద్దాపురం, పిఠాపురం, తుని) నియోజకవర్గాలు, 12 రోజులు..178.5 కి.మీ కలిపి మొత్తం 404 కి.మీ మేర యువగళం పాదయాత్ర కొనసాగింది. పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టు నేపథ్యంలో 79 రోజుల పాటు విరామానంతరం రాజోలు నియోజకవర్గం పొదలా డ వద్ద నవంబర్ 27న పునఃప్రారంభమైన యువగళం 2.0లో ప్రజలు గతం కంటే రెట్టించిన ఉత్సాహంతో పాల్గొన్నారు.

### ఉత్తరాంధ్ర ఉత్తేజం

ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇచ్ఛాపురం వరకు చేయాలనుకున్న యువగళం పాదయాత్రను యువనేత లోకేష్ అనివార్య పరిస్థితుల్లో విశాఖ జిల్లా అగనంపూడి వద్దే ముగించాల్సి వచ్చింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో 7 రోజులు, 113 కి.మీ మాత్రమే యాత్ర కొనసా గినప్పటికీ ప్రజలు ఉత్తేజంతో యువనేత వెంట నడిచారు. పాయకరావుపేట, యలమంచిలి, అనకాపల్లి, పెందుర్తి, గాజువాక నియో జకవర్గాల్లో యువగళం పాదయాత్ర సాగింది. లక్షలాది ప్రజలు, అభిమానులు, మహిళలు, టీడీపీ-జనసేన కార్యకర్తలు యువనేత కు నీరాజనాలు పట్టారు. మహిళలు, బీసీలు, రిటైర్డ్ ఉద్యోగులు, మత్స్యకారులు, యాదవులు, అగ్రిగోల్డ్ బాధితులు, మీ సేవా ఉద్యో గులతో లోకేష్ ముఖాముఖి సమావేశాలు నిర్వహించి వారి సమస్యలపై లోతైన అధ్యయనం చేసి పలు హామీలు ఇచ్చారు.

### హామీల అమలు దిశగా ప్రజాప్రభుత్వం అడుగులు

సుదీర్ఘ యువగళం పాదయాత్రలో అన్ని వర్గాల ఆకాంక్షలకు అనుగుణంగా యువనేత నారా లోకేష్ అనేక హామీలను ఇచ్చా రు. పాదయాత్రలో యువనేత నారా లోకేష్ ఇచ్చిన ఈ హామీ లను నెరవేర్చే దిశగా ప్రజాప్రభుత్వం అడుగులు వేస్తోంది. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తొలిరోజునే మెగా డీఎస్సీ ఫైలుపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తొలి సంతకం చేశారు. ఈ మేరకు నోటిఫికేషన్ ప్రకటించి కేవలం 150 రోజుల వ్యవధి లోనే ప్రక్రియ పూర్తిచేసి 15,941 మందికి టీచర్ ఉద్యోగ నియామకపత్రాలు అందించారు. అధికారంలోకి వచ్చాక యువతకు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తానని లోకేష్ హామీ ఇచ్చారు. ఈ మేరకు ఇప్పటివరకు 16 లక్షల ఉద్యోగాలు కల్పించే 23.5 లక్షల కోట్ల విలువైన పెట్టుబడుల కోసం అవగా హన ఒప్పందాలు జరిగాయి. మంత్రి నారా లోకేష్ అవిశ్రాంత కృషితో గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ & నిప్పాన్ స్టీల్స్, టీసీఎస్, కాగ్నిజెంట్, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ వంటి కంపెనీలు రాష్ట్రానికి క్యూ కట్టాయి. మిగిలిన హామీల అమలుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసిన యువనేత లోకేష్.. ఇందుకోసం ప్రత్యేక యంత్రాం గాన్ని ఏర్పాటు చేశారు.







# అడ్డంకులను అధిగమించి విజయం

**గొంతు నొక్కాలనుకుంటే..**
**యువగళం జనగళమై నినదించింది**
**తప్పుడు కేసులు పెట్టినా వెన్ను చూపలేదు**
**వైసీపీ అరాచకాలు ఎండగడుతూ మాటల తూటాలు**
**2024 కూటమి గెలుపులో యువగళం ప్రభావం**

అమరావతి (చైతన్యరథం): యువగళం పాదయాత్రకు లభిస్తు న్న అనూహ్య స్పందనతో అనాటి ప్రభుత్వ పెద్దల్లో వణుకు మొదలైంది. భీమవరం, ఉంగుటూరు, గన్నవరం, నూజివీడు నియోజకవర్గాల్లో వైసీపీ ముష్కర మూకలు, పోలీసులు కలిసి పసుపు సైనికులను రెచ్చగొట్టి.. తిరిగి వారిపైనే తప్పుడు కేసులు బనాయించారు. భీమవరంలో యువగళం పాదయాత్రపై సోడా సీసాలు, రాళ్లతో దాడి చేసిన వైసీపీ మూకలు.. తిరిగి 40 మంది యువగళం వాలంటీర్లపై నాన్ బెయిలబుల్ కేసులు బనా యించి రాజమండ్రి జైలుకు పంపారు. గన్నవరం నియోజక వర్గంలో విదేశాల్లో ఉన్న వారితో సహా 46 మంది కీలక నాయ కులపై తప్పుడు కేసులు పెట్టడం అప్పటి అధికార పార్టీలో యువగళం పై నెలకొన్న భయానికి అద్దంపట్టింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో యువనేత ప్రచార రథం మొదలు.. నిలబడే స్టూల్ వరకు అన్నీ లాగేసి గొంతునొక్కే ప్రయత్నం చేశారు. యువనేత లోకేష్ ఏ మాత్రం వెన్ను చూపకుండా కోట్లాదిమంది ప్రజల గొంతుకనే తన గళంగా వినిపిస్తూ రెట్టింపు ఉత్సాహంతో ముందుకు సాగారు.

### ప్రతి 20 కిలోమీటర్లకూ ఒక కేసు

కుప్పంలో యువగళం పాదయాత్ర ప్రారంభం మొదలు తంబళ్లపల్లి నియోజకవర్గం వరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రతి 20 కిలోమీటర్లకు ఒకటి చొప్పున మొత్తంగా 25 పోలీసు కేసులు నమోదయ్యాయి. ఇందులో యువనేత లోకేష్‌పై మూడు కేసులు నమోదు చేశారు. ప్రచార రథం, సౌండ్ సిస్టమ్, మైక్, స్టూల్‌తో సహా అన్నింటినీ పోలీసులు సీజ్ చేశారు. ఎంతలా వేధించినా, ఎన్ని తప్పుడు కేసులు బనాయించినా క్రమశిక్షణకు మారుపేరైన లోకేష్ నేతృత్వంలో యువగళం బృందాలు మొక్క వోని పట్టుదలతో ముందుకు సాగాయి. యువగళాన్ని స్వాగతి స్తూ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు చించడం, రాళ్లు రువ్వ డం, కవ్వించడం నాటి అధికార పార్టీ మానలేదు. యువగళం వెనకడుగు వేయలేదు.




### అడ్డంకులు సృష్టించినా అడుగు ముందుకే..

ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి తూర్పుగోదావరి వరకు యువ గళం పాదయాత్రను అడ్డుకునేందుకు అధికార పార్టీ చేయని కుట్రలు లేవు. యజ్ఞంలా సాగుతున్న యువగళాన్ని అడ్డుకోవడం వైసీపీ ముష్కర మూకల వల్ల కాలేదు. చైతన్యానికి మారుపేరైన విజయవాడ వంటి నగరంలో ప్రజలు స్వచ్ఛందంగా రోడ్లపైకి వచ్చి తెల్లవారుజాము వరకూ ఎదురుచూడటం యువనేత లోకేష్‌పై నెలకొన్న అభిమానం, నమ్మకానికి అద్దం పట్టింది. యువగళం పాదయాత్ర చిత్తూరు జిల్లా దాటకముందే రాష్ట్రంలో 108 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో జరిగిన 3 ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మద్దతునిచ్చిన అభ్యర్థులు విజయ దుందుభి మోగించడంతో అధికార పార్టీకి అప్పుడే కౌంట్‌డౌన్ మొదలైంది.

### మాటల తూటాలు..గెలుపు బాటలు

యువనేత లోకేష్ తాను పాదయాత్ర నిర్వహించే అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో బహిరంగ సభలు నిర్వహించి మాట ల తూటాలతో నాటి అరాచక పాలకులకు కంటిమీద కునుకు లేకుండా చేశారు. యువగళం పాదయాత్ర సాగిన 97 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 70 చోట్ల యువనేత లోకేష్ బహిరంగ సభల్లో ప్రసంగించారు. రాష్ట్రంలో జగన్‌రెడ్డి పాలనా వైఫల్యాలు, దోపిడీ విధానాలను ఎండగట్టడమే గాక ప్రతి బహిరంగసభలో ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేల అవినీతిని ఆధారాలతో సహా బట్టబయ లు చేయడంతో అధికార పార్టీ నేతలకు ముచ్చెమటలు పట్టాయి. సమాధానం చెప్పలేని అధికార పార్టీ ఎమ్మెల్యేలు వ్యక్తిగత దూష ణలతో ఎదురుదాడికి దిగారు. అయినా తగ్గేది లేదంటూ లోకేష్ సై అంటే సై అన్నారు. యువగళం పాదయాత్ర ప్రభావం 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి పార్టీలకు ఓట్ల వర్షం కురిపించి 94 శాతం స్ట్రయిక్ రేటుతో 164 సీట్లు గెల్చుకునేలా చేసింది.






## ఓ తల్లి ఆవేదన..

# 20 లక్షల ఉద్యోగాల కల్పనకు ప్రేరణ

**యువగళం హామీ అమలుకు అవిశ్రాంత కృషి - పారిశ్రామికవేత్తలను రప్పించడంలో సఫలీకృతం - 18 నెలల కూటమి పాలనలో పెట్టుబడుల వరద**



అమరావతి (చైతన్యరథం): యువగళం పాదయాత్ర 2023.. ఫిబ్రవరి 12న 17వ రోజు అది..జీడి నెల్లూరు నియోజకవర్గం లో సాగుతుండగా ఓ తల్లి లోకేష్‌కు తారసపడింది. ఆమె ఆవేదన విన్న తరువాతనే రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే దృఢనిశ్చయానికి వచ్చారు. పాదయాత్రలో లోకేష్ జీడి నెల్లూరు శివారు గ్రామంలో రోడ్డుపక్కన చిన్న టిఫిన్ బడ్డీ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న మోహన అనే మహిళను కలిశారు. మేం అధికారంలోకి వచ్చాక మీరు ఏం కోరుకుంటున్నారని ఆమెను అడిగారు. తన భర్త మద్యానికి బానిసై, అప్పులు చేసి ఆత్మహత్య చేసు కున్నాడని, ఆ తర్వాత తానే పాతికేళ్లుగా కుటుంబాన్ని పోషిస్తు న్నానని తెలిపింది. చదువుకున్న తమ ఇద్దరు బిడ్డలు పొరుగు రాష్ట్రానికి వలసవెళ్లే పనిలేకుండా స్థానికంగా ఉద్యోగాలు లభిస్తే చాలని, తమకు మరేమీ వద్దని తెలిపింది. మోహన మాటలతో చలించిన యువనేత లోకేష్.. రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తే యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. నాడు ఇచ్చిన హామీని తూచ తప్పకుండా అమలు చేసేందుకు మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నారు. అమెరికా, దావోస్, సింగపూర్, యూకే, ఆస్ట్రేలియాల్లో పర్యటించి పారిశ్రామికవేత్తలతో విస్తృతంగా చర్చలు జరిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులకు గల అనుకూలతలను వివరించి దేశ విదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలను రాష్ట్రానికి రప్పించడంలో సఫలీకృతులయ్యారు. ఫలితంగా రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తాయి.

### 18 నెలల కూటమి పాలనలో పరిశ్రమలు క్యూ

దేశ, విదేశాల్లోని ప్రఖ్యాత పారిశ్రామిక సంస్థలను రాష్ట్రానికి రప్పించి యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా యువనేత లోకేష్ పనిచేస్తున్నారు. ఉద్యోగ, ఉపాధికల్పన సబ్ కమిటీ చైర్మన్‌గా మంత్రి లోకేష్ అవిశ్రాంత కృషి, పట్టుదల.. చంద్రబాబునాయుడు బ్రాండింగ్ కారణంగా 18 నెలల్లోనే రాష్ట్రంలో 23.5 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయి. విశాఖలో సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్‌లో 613 పారిశ్రామిక సంస్థలు రూ.13.25 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ఎంవోయూలు కుదుర్చుకున్నాయి. అంతకుముందు సుమారు 200 పరిశ్రమలు $120 బిలియన్ డాలర్లు (రూ.10.25 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఏపీ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. మొత్తంగా 18 నెలల వ్యవధిలో రాష్ట్రానికి రూ.23.5 లక్షల కోట్లు పెట్టుబడు లు వచ్చాయి. ఇందులో రూ.లక్ష కోట్ల పైబడిన, సమీప భారీ పెట్టుబడులే రూ.10 లక్షల కోట్లకు పైగా ఉండటం విశేషం. దేశ చరిత్రలో భారీ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి గూగుల్ ఏఐ హబ్ $15 బిలియన్ డాలర్లు (రూ.1.33 లక్షల కోట్లు), దేశంలో అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ఆర్సెలార్ మిట్టల్ & నిప్పాన్ స్టీల్ రూ.1.35 లక్షల కోట్లు, రిలయన్స్ డేటా సెంటర్ రూ.1.10 లక్షల కోట్లు, రిలయన్స్ సీబీజీ (రూ.65 వేల కోట్లు, ఏబీసీ క్లీన్ టెక్ రూ.1.10 లక్షల కోట్లు, ఎన్ టీపీసీ గ్రీన్ రూ.1.85 లక్షల కోట్లు, బ్రూక్ ఫీల్డ్ డేటా సెంటర్ 1.10 లక్షల కోట్లు, బీపీసీఎల్ రిఫైనరీ రూ.95 వేల కోట్లు, రెన్యూ పవర్ రూ.82 వేల కోట్లు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి.

### స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో భారీ పెట్టుబడులు

తాజాగా దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సు సందర్భంగా మంత్రి లోకేష్ చొరవతో ఆర్ఎం జడ్ సంస్థ $10 బిలియన్ డాలర్లు (రూ.90 వేల కోట్లు) పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చింది. కేవలం 9 బడా సంస్థలు రూ.10 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చాయి. గత 18 నెలల కాలంలో నెలకు సగటున రూ.1.40 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పరిశ్రమలు ముందుకు వచ్చాయి. కేవలం ఎంవోయూలతో సరిపెట్టకుండా ప్రతి భారీ పరిశ్రమకు ఒక వాట్సప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసి ఆయా సంస్థలకు అవసరమైన అనుమతులను వెంటపడి క్లియర్ చేస్తున్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, డబుల్ ఇంజన్ సర్కార్ నినాదాలతో లోకేష్ పెట్టుబడిదారులను ఆకర్షిస్తున్నారు. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే పరిశ్రమలకు కేవలం 21 రోజుల్లో అన్ని అనుమతులు లభిస్తాయి. కూటమి ప్రభుత్వం తెచ్చిన 23 పారిశ్రామిక పాలసీలతో ఏపీ వైపు పారిశ్రామి కవేత్తలు చూస్తున్నారు. అలాగే ఎస్క్రో ఎకౌంట్ ద్వారా నేరుగా రాయితీలు పెట్టుబడిదారుల ఖాతాలకు బదిలీ చేస్తామని భాగస్వామ్య సదస్సులో ముఖ్యమంత్రి ప్రకటించారు.

### బ్రాండ్ బాబు మార్గదర్శకత్వంలోనే..


పెట్టుబడుల సాధనలో చంద్రబాబునాయుడు జీపీఎస్ అయితే తాము మిసైల్.. ఆయన మార్గదర్శకత్వంలోనే ముందుకు సాగుతు న్నామని యువనేత లోకేష్ పెట్టుబడుల సదస్సులో చెప్పారు. పెట్టుబడుల సాధనలో యువనేత లోకేష్ చూపుతున్న చొరవ, లౌక్యం, వేగంను అంతర్జాతీయ పారిశ్రామిక, మీడియా సంస్థలు ప్రశంసిస్తున్నాయి. కేంద్రంతో భాగస్వామి కావడం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయన మంత్రివర్గంతో సత్సంబంధాలు..ఏపీకి వచ్చే పెట్టుబడులకు గల అడ్డంకులను తొలగించి బిలియన్ల డాలర్ల ప్రాజెక్టులకు సాధించడంలో లోకేష్ చాతుర్యాన్ని ఇతర రాష్ట్రాల నేతలు సైతం మెచ్చుకుంటున్నారు.







# త్రివర్ణ పతాకం రెపరెపలు



- టీడీపీ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు
- 105 అడుగుల ఎత్తులో జాతీయ జెండా
- ఆవిష్కరించిన పల్లా శ్రీనివాసరావు

మంగళగిరి(చైతన్యరథం) తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాల యంలో 77వ గణతంత్ర దినోత్సవం వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. దేశంలోనే మునుపెన్నడూ లేని విధంగా అత్యాధునిక ఎలక్ట్రానిక్ పద్ధతిలో 105 అడుగుల ఎత్తులోని జాతీయ జెండాను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆవి ష్కరించారు. జాతీయ జెండాను ఎలక్ట్రానిక్ పద్ధతిలో రిమోట్ సహాయంతో ఆవిష్కరించేలా రూపొందించారు. జెండా ఆవిష్కరణ అనంతరం నేతలందరూ కలిసి జాతీయ గీతాన్ని ఆలపించి అంబే ద్కర్, మహాత్మాగాంధీ, స్వర్గీయ ఎన్టీఆర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ కేంద్ర కార్యాలయ కార్యదర్శి పరుచూరి అశోక్‌బాబు, మాజీ మంత్రి, ఏపీ మహిళా సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్ పర్సన్ పీతల సుజాత, మీడియా కోఆర్డినేటర్ దారపనేని నరేంద్రబాబు, నేతలు పరుచూరి కృష్ణ, వల్లూరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ముందుగా రాష్ట్ర ప్రజలందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం మన పార్లమెంట్ ఆమోదం పొంది అమల్లోకి వచ్చిన ఈ రోజు అత్యంత పవిత్రమైనది. నిన్ననే మనం జాతీయ ఓటర్ల దినోత్సవా న్ని జరుపుకున్నాం. ఎన్నికల ప్రక్రియను, రాజ్యాంగ బద్ధమైన ఓటు హక్కును గౌరవించడమే దీని ముఖ్య ఉద్దేశం.

రాజ్యాంగ గొప్పత నాన్ని, దాని విలువలను భవిష్యత్ తరాలకు అందించడమే ఈ గణతంత్ర వేడుకల ప్రధాన లక్ష్యం. రాజకీయాల్లోకి వచ్చే ప్రతి ఒక్కరూ రాజ్యాంగం, ప్రజాస్వామ్యానికి విలువ ఇవ్వాలి. పదవులు దక్కిన తర్వాత ప్రజల హక్కులను కాలరాసే విధంగా ప్రవర్తించడం రాజ్యాంగ విరుద్ధం. అంబేద్కర్ చెప్పినట్లుగా.. రాజ్యాంగం తన లక్ష్యాన్ని చేరాలంటే పాలకులు నిజాయితీగా, ప్రజాస్వామ్య విలువ లను కాపాడుతూ నడుచుకోవాలి.

గత ఐదేళ్ల పాలనలో మనం నియంతృత్వ పోకడలను చూశాం. అలాంటి వారికి ప్రజలు ఇప్ప టికే బుద్ధి చెప్పి పక్కన కూర్చోబెట్టారు. భారతదేశంలో కానీ, మన రాష్ట్రంలో కానీ ప్రతిఒక్కరూ ప్రాథమిక హక్కులను, న్యాయపర మైన హక్కులను కాపాడాల్సిన అవసరం ఉంది. అధికారంలో ఉన్నవారు, అధికారాన్ని ఆశించే వారు రాజ్యాంగాన్ని నిజాయితీగా అమలు చేసే ప్రయత్నం చేయాలి.

హక్కులను కాలరాసే వారికి భవిష్యత్తులోనూ ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు. ఎన్టీఆర్ పార్టీని స్థాపించిన నాటినుంచి నేటి వరకు గత 40 ఏళ్లుగా చంద్ర బాబు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పార్టీని నడిపిస్తున్న తీరు అందరికీ ఆదర్శం. యువ నాయకులు నారా లోకేష్ ఆలోచనలు కూడా అదే బాటలో ఉన్నాయి. మేమంతా రాజ్యాంగ హక్కులను, ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో ఎప్పుడూ ముందుంటాం. రాజ్యాంగం ఏ ఉద్దేశంతో అయితే రూపొందించబడిందో, ఆ లక్ష్యాన్ని చేరుకునేలా తెలుగుదేశం పార్టీ నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు.











# గుడ్ గవర్నెన్స్‌కు గ్లోబల్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్

- స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనలో ఉద్యోగులే ప్రధాన శక్తి
- కూటమి పాలనలో నూతన ప్రమాణాలకు శ్రీకారం
- అభివృద్ధి ప్రణాళిక సంఘం ఈడీ వి.ఆర్.ఆలపర్తి
- ఏపీఎస్‌డీపీఎస్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు

అమరావతి(చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌ను సమగ్ర అభివృద్ధి, మంచి పాలన, సామాజిక సమానత్వం, ఆర్థిక స్వయం సమృద్ధి కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దడం, ప్రతి పౌరుడికి గౌరవప్రదమైన జీవితం, నాణ్యమైన సేవలు, స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ విజన్ కేంద్ర బిందువు అని రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సంఘం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.ఆర్.ఆలపర్తి అన్నారు. భారత స్వాతంత్ర్య పోరాటానికి ప్రాణంగా నిలిచిన "వందేమాతరం" గీతం జన్మించి 150 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ గీతం కేవలం ఒక పాట కాదు.. దేశభక్తిని రగిలించిన మంత్రమని కొనియాడా రు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ కార్యాల యంలో 77వ



గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వ హించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం అనేది ప్రజల జీవితాల్లో మెరుగైన పాలన ద్వారా రాజ్యాంగ విలువలను అమలు చేసే సంకల్పానికి ప్రతీక అని పేర్కొన్నారు. "ప్రభుత్వ వ్యవస్థ బలపడాలంటే ముందుగా ఆ వ్యవస్థను నడిపే ఉద్యోగుల ఆలోచనలు, నైపుణ్యాలు బలపడాలి" అనే సిద్ధాంతంతో ఏపీఎస్ డీపీఎస్ పాలనలో నూతన ప్రమాణాలను నెలకొల్పుతోందని తెలిపారు. సమగ్ర ప్రభుత్వ ఆన్‌లైన్ శిక్షణ (iGOT) కర్మయోగి అమ లులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని ఆయన తెలిపారు. మంచి పాలనకు నూతన ప్రమాణాలు నెలకొల్పుతూ, ఆంధ్రప్రదేశ్‌ను గుడ్ గవర్నెన్స్‌కు జాతీయ, అంతర్జాతీయ కేంద్రంగా నిలపాలన్నదే 2047 విజన్ – స్వర్ణాంధ్ర తుది లక్ష్యమన్నారు. స్వర్ణాంధ్ర 047 లక్ష్యాల సాధనకు ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేక విజన్, యాక్షన్ ప్లాన్ రూపొందించామని, 175 నియోజకవర్గ యూనిట్లు, 26 జిల్లా యూనిట్లతో క్షేత్రస్థాయి మానిటరింగ్ వ్యవస్థను బలోపేతం చేసినట్లు తెలిపారు. శ్రీవారి సేవకు ఆధునిక శిక్షణ మోడల్, యంగ్ ప్రొఫెషనల్స్ నియామకం, ప్రభుత్వ ఉద్యో గుల పనితీరు అంచనాకు గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ స్కోర్‌కార్డ్ వంటి కార్యక్రమాలను పాలనలో స్పష్టమైన మార్పును తీసుకొస్తు న్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మోహన్‌రావు డైరెక్టర్ (అడ్మినిస్ట్రేషన్), వెంకటేశ్వర స్వామి సీనియర్ అడ్వైజర్, వి.పూర్ణ ప్రసాద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చైతన్యరథం





# 10 సూత్రాలతో ప్రగతి ప్రయాణం

- 2047 లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది
- సాంకేతికతతో పాలనతో కొత్త పుంతలు
- రాజధానిలో గణతంత్ర వేడుకలు చరిత్రాత్మకం
- ప్రజలనుద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం

అమరావతి(చైతన్యరథం): స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంగా ఆం ధ్రప్రదేశ్ ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ వెల్లడించారు. 10 సూత్రాల ఆధారంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. సోమవారం రాజధాని అమరావతి లో 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆయన జాతీయ జెండాను ఎగరవేసి రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. జీరో పావర్టీ, ఎన్టీఆర్ భరోసా ద్వారా పెన్షన్ అందించి పేదలకు అండగా ఏపీ ప్రభుత్వం ఉంటుందని స్పష్టం చేశారు. దీపం 2.0 ద్వారా ఏడాదికి 3 ఎల్పీజీ సిలిండర్లను ప్రభుత్వం అందిస్తోందని వివరించారు. మహిళలు, ట్రాన్స్‌జెండర్ల కోసం ఉచిత బస్ ప్రయాణ సౌకర్యాన్ని స్త్రీ శక్తి పథకం ద్వారా అందిస్తోందని చెప్పారు. రూ.978 కోట్ల నిధులను ప్రధానమంత్రి స్వనిధి కోసం ఖర్చు చేశామని పేర్కొన్నారు. 10 సూత్రాలు అమలు చేస్తూ ప్రభు త్వం ముందుకు వెళు తోందని వివరించారు. ఇక ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో సామాజిక పెన్షన్లు అత్యంత కీలక మైనవని అభివర్ణించారు. ప్రతి నెలా 63 లక్షల మందికిపైగా ప్రజలకు సామాజిక పెన్షన్లు అందిస్తున్నట్లు గుర్తు చేశారు. రాష్ట్రం లో 20 లక్షల ఉద్యోగాల కల్పనపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించిం దన్నారు. అలాగే పాపులేషన్ మేనేజ్‌మెంట్‌పై ఈ ప్రభుత్వం దృష్టి పెట్టిందని తెలిపారు. నీటి భద్రత ప్రభుత్వ విధామని చెప్పారు. పోలవరంతో సహా అన్ని ప్రాజెక్ట్‌లు పూర్తి చేయడంపై ప్రభుత్వం ఇప్పటికే దృష్టి కేంద్రీకరించిందని చెప్పారు. పోలవరం-నల్లమల్ల సాగర్ ప్రాజెక్ట్‌పై ఇతర రాష్ట్రాలకు ఇబ్బంది కలగకుండా ఏపీ ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. రైతుల కోసం ప్రత్యేక కార్యక్ర మాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధతో ప్రభుత్వం పనిచేస్తుందని స్పష్టం చేశారు. అందుకోసం పొలం పిలుస్తోంది, రైతన్న మీ కోసం, తదితర కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తోందని వివరించారు.

### రాజధానిలో తొలిసారి చారిత్రాత్మకం


నేటి గణతంత్ర వేడుక చరిత్రాత్మకమని అభివర్ణించారు. తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ ప్రజల రాజధాని అమరావతిలో జాతీయ జెండాను ఎగురవేస్తున్నామని ఉద్ఘాటించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలే -- ప్రగతికి నిజమైన శిల్పులని అభివర్ణించారు. ప్రభుత్వ ప్రతి చర్య, ప్రతి సంస్కరణ, ప్రతి సమీక్ష ప్రజల ఆకాంక్షలను నెరవేర్చు తూ వృద్ధిని పునరుద్ధరించడానికే ఉద్దేశించబడిందని స్పష్టం చేశా రు. ఈ ప్రయాణం సులభం కాదు.. దీనికి క్రమశిక్షణ, సహన శక్తి, సామూహిక లక్ష్యంపై అపారమైన విశ్వాసం అవస రమయ్యా యన్నారు. ఫలితాలు ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రాజెక్టులు ముందుకు సాగుతున్నాయని.. సంస్థలు తిరిగి బలపడుతున్నాయని.. ప్రజల విశ్వాసం మళ్లీ స్థాపితమవు తోందని విశ్వాసం వ్యక్తం చేశారు. పునరుద్ధరణ మార్పు ప్రయా ణం ప్రారంభమైందని వ్యాఖ్యానించారు. ఈ దిశను మరింత స్పష్టంగా ముందుకు తీసుకెళ్లేందుకు.. ఈ ప్రభుత్వం స్వర్ణాంధ్ర 2047 కార్యాచరణను ఒక స్పష్టమైన దృష్టిలో స్థిరపరిచిందని చెప్పారు. భారత స్వాతంత్ర్య శతాబ్ది నాటికి, బలమైన, సమగ్ర, ప్రపంచ స్థాయిలో పోటీతత్వం గల రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే ఈ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా సుపరి పాలనకు 10 సూత్రాలు.. పేదరికం లేని సమాజం, యువగళం, జనాభా నిర్వహణ - మానవ వనరుల అభివృద్ధి, నీటి భద్రత, ఆగ్రి టెక్, మౌలిక సదుపాయాలు, ఇంధనం, బ్రాండ్ ఏపీ, స్వచ్ఛాంధ్ర, స్మార్ట్ గవర్నెన్స్ లక్ష్యాలను వివరించారు. ఈ 10 మార్గదర్శక సూత్రాల ఆధారంగా సాధించిన పురోగతిని, రాష్ట్ర దిశను, గమ్యాన్ని నిర్వచిస్తున్న విజయాలను ప్రజల ముందుంచడం గర్వకార ణమని అభివర్ణించారు.

### ప్రజల చెంతకు పాలన

ఆంధ్రప్రదేశ్‌లో సాంకేతికత పాలన కొత్త పుంతలు తొక్కుతోందన్నారు. సేవలను వేగవంతంగా, జీవనాన్ని సులభంగా, పరిపాలనను మరింత తెలివైనదిగా మార్చుతోందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రతి కార్యక్రమం వెనుక ఉన్న ప్రధాన లక్ష్యం ఒక్కటే.. సేవల అందించడం మెరుగుపరచడం, ప్రభుత్వాన్ని ప్రజ లకు మరింత చేరువ చేస్తుందన్నారు. అతి త్వరలోనే భారతదేశం లో తొలి క్వాంటం కంప్యూటర్‌ను అమరావతి క్వాంటం వ్యాలీలో ఏర్పాటు చేస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. శ్రీహరికోట పరిసర ప్రాంతాల్లో స్పేస్ సిటీ ఏర్పాటు ద్వారా అంతరిక్ష సాంకేతిక స్టార్టప్ లు, తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తూ, ఆంధ్రప్రదేశ్‌ను ఆవి ష్కరణల అగ్రగామి కేంద్రంగా నిలబెడుతున్నామన్నారు. రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ కృత్రిమ మేధ (ఏఐ), బ్లాక్ చెయిన్ సాంకేతికత లను సమన్వయం చేస్తూ, పాలనలో పారదర్శకతను సామర్థ్యాన్ని మరింత పెంచుతోందని తెలిపారు. ఆరోగ్య రంగంలో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో, ఖచ్చితమైన వ్యాధి నిర్ధారణ కోసం ఏఐ ఆధారిత వైద్య నిర్ధారణ సేవలను విస్తరిస్తున్నామని పేర్కొన్నారు. వాట్సాప్‌లోనే 119 ప్రభుత్వ సేవలు అందుబాటు లోకి వచ్చాయని గుర్తు చేశారు. సర్టిఫికెట్లు పొందడం, సంక్షేమ పథకాల స్థితిని తెలుసుకోవడం, ఫిర్యాదులు నమోదు చేయటం తదితర అంశాలు ఇప్పుడు క్షణాల్లో సాధ్యమవుతున్నాయన్నారు. ఇప్పుడు పాలన ఒక మెసేజ్ దూరంలోనే ఉందని చమత్కరించారు. భారతదేశంలోనే డ్రోన్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్ ఎదుగుతోందని చెప్పారు. కర్నూ లు జిల్లా ఓర్వకల్‌లో 300 ఎకరాల విస్తీర్ణంలో డ్రోన్ సిటీ నిర్మా ణం జరుగుతోందన్నారు. ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ కార్యక్రమాలు ఏపీని దేశంలో అగ్రస్థానంలో నిల బెట్టే దిశగా సాగుతున్నాయని తెలిపారు.

## 100 అడుగుల ఎత్తులో టీడీపీ జెండా

**- టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆవిష్కరణ**



మంగళగిరి(చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాల య ఆవరణలో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపే విధంగా మరో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సోమవారం గణతంత్ర దినోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అత్యాధునిక ఎలక్ట్రానిక్ పద్ధతిలో ఏర్పాటు చేసిన 100 అడుగుల భారీఎత్తున తెలుగుదేశం పార్టీ జెండాను ఘనంగా ఆవిష్కరించారు. ఈ 100 అడుగుల భారీ జెండాను అత్యాధునిక సాంకేతికతతో రిమోట్ సహాయంతో ఆవిష్కరించేలా ప్రత్యేకంగా రూపొందించారు. పల్లా శ్రీనివాసరావు రిమోట్ నొక్కగానే జెండా ఆవిష్కృతం కావడంతో కార్యాలయ ఆవరణ అంతా పండుగ వాతా వరణం నెలకొంది. ఈ కార్యక్రమం టీడీపీకి సాంకేతికతపై ఉన్న మక్కువను, అప్-డేటెడ్ విజన్‌ను మరోసారి చాటిచెప్పింది. జెండా ఆవిష్కరణ అనంతరం నేతలందరూ కలిసి భక్తిశ్రద్ధలతో "మా తెలుగుతల్లికి మల్లెపూదండ" గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ కేంద్ర కార్యాలయ కార్యదర్శి పరుచూరి అశోక్ బాబు, మాజీ మంత్రి, ఏపీ మహిళా సహకార ఆర్థిక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పీతల సుజాత, మీడియా కోఆర్డినేటర్ దారపనేని నరేంద్రబాబు, నేతలు పర్చూరి కృష్ణ, వల్లూరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ స్ఫూర్తికి నిలబెట్టాలి

- ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి
- సీఎస్ కె.విజయానంద్ పిలుపు
- సచివాలయంలో గణతంత్ర వేడుకలు



అమరావతి(చైతన్యరథం): సమాజంలోని ప్రతిఒక్కరూ మన రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా నడుచుకోవాలని అప్పుడే రాజ్యాంగ నిర్మాతల కలలు సాకారం అవుతాయని ప్రభుత్వ ప్రధా న కార్యదర్శి కె.విజయానంద్ పిలుపునిచ్చారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర సచివాలయం మొదటి బ్లాకు వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. అనంత రం మువ్వన్నెల జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగం మనదని నాటి రాజ్యాంగ నిర్మాతలు ఎంతో ముందుచూపుతో దేశంలోని పౌరులందరికీ సమాన అవకాశాలు కల్పించేందుకు, ఆర్థిక అసమానతలను తొలిగించేందుకు అన్ని అంశాలను పొందు పర్చి ఒక గొప్ప రాజ్యాంగాన్ని మనకు అందించారని గుర్తు చేశారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా స్వర్ణాంధ్ర 2047 నాటికి రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా చేసేందుకు ప్రభు త్వం పెద్దఎత్తున ప్రణాళికలు అమలు చేస్తోందని ఆయా లక్ష్యాల సాధనకు ప్రభుత్వ యంత్రాంగమంతా కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా సమాజంలోని పేదరిక నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా అన్ని శాఖలు పనిచేసి మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు ఎస్పీఎఫ్ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాధారణ పరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు, సచివాలయ ముఖ్య భద్రతాధికారి మల్లికార్జునరావు, ఏపీ సచివా లయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రామకృష్ణ, పలువురు సచివాలయ అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# చట్టసభే ప్రజాస్వామ్యానికి గుండెకాయ

- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలి
- స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు
- గణతంత్ర వేడుకల్లో జెండా ఆవిష్కరణ



అమరావతి(చైతన్యరథం): గణతంత్ర రాజ్యానికి మూలం ప్రజలేనని, ప్రజలచే ఎన్నుకోబడిన ప్రతినిధులు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉందని స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు పిలుపునిచ్చారు. చట్టసభలు ప్రజాస్వామ్యానికి గుండెకాయ అని, ఇక్కడ జరిగే చర్చలు, సంప్రదింపుల ద్వారానే దేశానికి అవసరమైన చట్టాలు రూపుదిద్దుకుంటాయని వివరించారు. 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర అసెంబ్లీ భవనం వద్ద సోమవారం జరిగిన వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మువ్వన్నెల జాతీయ జెండాను ఆవిష్కరించారు. జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, చట్టసభల గౌరవాన్ని పెంచుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేయాల్సిన బాధ్యత శాసనసభ్యులకు ఉందని తెలి పారు. సమగ్ర అభివృద్ధి, సామాజిక సామరస్యత, ప్రజల ఐక్యతతో బలమైన, స్వయం సమృద్ధి కలిగిన, సుభిక్షమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి అందరం కలిసికట్టుగా పనిచేయాలని పిలుపు నిచ్చారు. ఈ మధ్య లక్నోలో జరిగిన 86వ అఖిల భారత స్పీకర్ల సదస్సులో పాల్గొని మూడు ప్రధాన అంశాలను ప్రస్తావించానని తెలిపారు. శాసనసభలు ప్రతి సంవత్సరం కనీసం 60 రోజులు పనిచేయాలని, శాసన సభ్యులకు "నో వర్క్ -- నో పే" విధానం ఉండాలని మరియు తీరు మార్చుకోని సభ్యులపై ప్రజలకు "రైట్ టు రీకాల్" హక్కు కల్పించాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణం వేగంగా కొనసాగుతుందని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే పోలవరం ప్రాజెక్టు త్వరలో పూర్తికానుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సభాపతి కె.రఘురామకృష్ణంరాజు, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ఎస్.ప్రసన్నకుమార్, అసెంబ్లీ ఉప కార్యదర్శి రాజ్‌కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

**మహోన్నతమైన గ్రంథం రాజ్యాంగం**

భారత రాజ్యాంగం దేశంలోని అన్ని గ్రంధాల కంటే ఎంతో మహోన్నతమైన గ్రంథం అని రాష్ట్ర శాసనమండలి అధ్యక్షులు కొయ్యే మోషేన్‌రాజు పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పుర స్కరించుకుని అసెంబ్లీ భవనం ప్రాంగణంలో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొని మువ్వన్నెల జాతీయ జెండాను ఆవిష్కరించి రాష్ట్ర ప్రజలందరికీ శు భాకాంక్షలు తెలిపారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడదాం

*గణతంత్ర దినోత్సవ వేడుకల్లో మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి*



కొండపి(చైతన్యరథం): రాజ్యాంగ విలువలను కాపాడుకుంటూ ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరం పాటుపడదామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం తూర్పునాయుడు క్యాంపు కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ సందర్భంగా మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి జాతీయ జెండా ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించా రు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వసత్తాక, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యాంగా భారతదేశం అవతరించిన ఈ శుభ దినోత్సవాన ప్రజలందరికీ రిపబ్లిక్ డే శు భాకాంక్షలు. మనల్ని మనం పాలించుకునేందుకు రూపొందించుకున్న రాజ్యాంగం నేడు అమల్లోకి వచ్చిన రోజు. అంబేద్కర్ నేతృత్వంలోని రాజ్యాంగ సభ మనకు ఇచ్చిన రాజ్యాంగం.. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి పునాదులు వేసింది. ప్రతిఒక్కరూ రాజ్యాంగ విలువలు కాపాడాలని, ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడాలి. ఎందరో మహనుభావులు ప్రాణాలు పణంగా పెట్టి దేశానికి స్వాతంత్ర్యాన్ని తీసుకువచ్చారు. జగన్‌కు ఒక్క ఛాన్స్ ఇచ్చినందుకే రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లింది. నేడు కూటమి పాలనలో సీఎం చంద్రబాబు నాయుడు అభివృద్ధి, సంక్షేమ పాలనతో పాటు రాష్ట్రంలో పేదరికా న్ని నిర్మూలించేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

**బాలికల గురుకుల పాఠశాలలో గణతంత్ర వేడుకలు**

బాలికల విద్యకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుం దని మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. సోమవా రం కొండపి అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సంద ర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాల్ని తిలకించిన అనం తరం మంత్రి బహుమతులు ప్రదానం చేశారు. పేద పిల్లలు డాక్టర్లు, ఇంజనీర్లు కావాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యం. అంబేద్కర్ గురుకులాల్లో ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్లు 3 నుంచి 10కి పెంచాం. ఐఐటీ నీట్‌లో తృటిలో అవకాశం కోల్పోయిన విద్యార్థులకు ఉచితంగా లాంగ్ టర్మ్ కోచింగ్ ఇస్తున్నామని తెలిపారు.

# వెలిగొండకు ఏం చేశారని క్రెడిట్ చోరీ?

- ఐదేళ్ల పాలనలో ప్రాజెక్టును నిర్వీర్యం చేశారు
- నీ క్రిమినల్ క్రెడిట్‌ను ఎవరూ చోరీ చేయలేరు
- జగన్‌పై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ధ్వజం



అమరావతి(చైతన్యరథం): రైతాంగానికి శరవేగంగా సాగునీరు అందించాలన్న సంకల్పంతో సీఎం చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టు శ్రీకారం చుట్టి 80 శాతం పనులు పూర్తి చేస్తే... కేవలం రూ.170 కోట్ల పనులు చేసి ప్రాజెక్టు పూర్తి చేసినట్టు జాతికి అంకితం చేశానంటూ రైతాంగాన్ని జగన్‌రెడ్డి మోసం చేశాడని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2014--19 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.1,500 కోట్లు ఖర్చు చేసి మొదటి టన్నెల్ 17.8 కి.మీ., రెండో టన్నెల్ 12.01 కి.మీ. మేర టన్నెల్ బోరింగ్ మిషన్ ద్వారా నిబంధనల ప్రకారం పూర్తి చేశాం. మిగి లిన పనుల కోసం జీఓ ఎంఎస్-40 ద్వారా రూ.1,041 కోట్లకు పరిపాలన అనుమతులు కూడా ఇచ్చాం. కానీ 2019--24 మధ్య అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టును పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దాదాపు జగన్ ప్రభుత్వం రూ.3 వేల కోట్లకు పరిపాలన అనుమతులు ఇచ్చి కేవలం రూ.170 కోట్ల పనులు చేసి.. నేడు చంద్రబాబు ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా పేలుళ్లతో టన్నెల్‌లో మాన్యువల్ పనులు చేపట్టి ప్రాజెక్టును దెబ్బతీశారు. ఫీడర్ కాలువలో చాలా చోట్ల ప్రక్చర్లు పెండింగ్‌లో ఉండగా, అనేకచోట్ల మట్టి కట్టలు కోతకు గురై లైనింగ్ చేయాల్సి ఉంది. వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి ఇంకా ఫీడర్ కాలువ లైనింగ్, కొన్నిచోట్ల వంతెనల నిర్మాణం చేయాల్సి ఉంది. తూర్పు ప్రధాన కాలువ, తీగలేరు కాలువ పనులు, వంతెనలు, హెడ్ రెగ్యులేటర్ అసంపూర్తిగానే ఉన్నాయి. ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో మొత్తం ప్రాజెక్టును నిర్వీర్యం చేశాడు. జగన్ ఐదేళ్లలో టన్నెల్-2లో కేవలం 745 మీటర్ల బెంచింగ్, 705 మీటర్ల లైనింగ్ మాత్రమే జరిగితే... కూటమి ప్రభుత్వంలో 18 నెలల్లోనే 6,579 మీటర్ల బెంచింగ్, 3,644 మీటర్ల లైనింగ్ పనులు పూర్తయ్యాయి. ఈ 18 నెలల పాలనలో దాదాపు రూ.1,039 కోట్లు కేటాయించి పనులు చేస్తు న్నాం. రూ.456 కోట్లతో చేపట్టిన ఫీడర్ కెనాల్ లైనింగ్, 5.3 కి.మీ రిటైనింగ్ వాల్ కాంక్రీట్ పనులను ఈ నెలలో ప్రారంభించబోతు న్నాం. ఖరీఫ్ నాటికి రైతాంగానికి సాగునీరు అందించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన పనులు కొనసాగిస్తోందని స్పష్టం చేశారు. తండ్రి శవంతో రాజకీయం, బాబాయ్ శవంతో రాజకీయం, పార్టీ కార్యకర్తలు మరణిస్తే వారి శవాలతో రాజకీయం నీ క్రెడిట్. సొంత తల్లిని ఇంట్లో నుంచి గెంటేస్తావ్, చెల్లి చీరపై కామెంట్స్ చేస్తావ్..ఇది నీ క్రెడిట్. సొంత జిల్లాలో అన్న మయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి 39 మంది ప్రాణాలు తీసిన క్రెడిట్ నీది. ఏ ప్రాజెక్టును పూర్తి చేయకుండా కాలయాపన చేసిన క్రెడిట్ నీది. నీ క్రిమినల్ క్రెడిట్‌ను ఎవ్వరూ చోరీ చేయలేరని హితవు పలికారు.

# రాజ్యాంగం న్యాయవ్యవస్థకు దీపస్తంభం

*- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్*



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం ఆవరణలో 77వ భారత గణతంత్ర్య దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ మువ్వన్నెల జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం సభికులను ఉద్దేశించి ప్రసంగించారు. భారత రాజ్యాంగం ప్రజాస్వా మ్యానికి మార్గదర్శి అని, న్యాయవ్యవస్థకు దీపస్తంభం అని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం 1950 జనవరి 26న అమల్లోకి రావడంతో దేశం ప్రజాస్వామ్య గణతంత్రంగా అవతరిం చిందని, ప్రజాస్వామ్య పాలనా వ్యవస్థకు రాజ్యాంగం మార్గదర్శక దీపికగా నిలిచిందని పేర్కొన్నారు. చట్టాధి పత్యం, వివక్ష రహిత సమాజం, పౌరహక్కుల పరిరక్షణ, ప్రజల సంక్షేమ ప్రాధాన్యం అనే మూల సూత్రాలు భారత ప్రజాస్వామ్య బలాన్ని ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి గణతంత్ర దినోత్సవం భారత ప్రజలకు ఆశ, విశ్వాసం, పునరుద్ధరణకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రజాస్వామ్యం న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం మరియు హక్కుల సమన్వయంగా ప్రతి పౌరుడికి నిర్భయంగా జీవించే, స్వప్నాలను సాకారం చేసుకునే హక్కును ఇస్తుందని తెలిపారు. దేశ అభివృద్ధిలో పేదరికం, సామాజిక వివక్ష వంటి అడ్డంకులను అధిగమించేందుకు ప్రభుత్వం సామాజిక, ఆర్థిక సంక్షేమ పథకాలు, విద్యా ఆవిష్కరణలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత వంటి రంగాల్లో నూతన కార్యక్రమాలను ప్రవేశపెట్టిందన్నారు. ఇటీవలి దశాబ్దాల్లో చట్టాల పరిణామం పర్యావరణ పరిరక్షణ, వ్యక్తిగత గోప్యత, డేటా రక్షణ, జాతీయ భద్రత, కృత్రిమ మేధస్సు వంటి కొత్త రంగాల వరకూ విస్తరించిందని పేర్కొన్నారు. భారత న్యాయవ్యవస్థ రాజ్యాంగ విలువలను కాపాడుతూ సామాజిక మార్పు సాధనంగా, పౌర హక్కుల సంరక్షకుడిగా, కేంద్ర, రాష్ట్ర సంబంధాలలో సమతుల్యం తను కల్పించే స్తంభంగా వ్యవహరి స్తోందని అన్నారు. బలమైన, ఐక్యమైన, సుస్థిరమైన, ప్రగతిశీల భారత నిర్మాణా నికి అందరం కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపుని చ్చారు. గౌరవ న్యాయ మూర్తులకు, మాజీ న్యాయమూర్తులకు, లా ఆఫీసర్లకు, సీనియర్ అడ్వకేట్లకు, న్యాయ వ్యవస్థ సభ్యు లకు, రిజిస్ట్రీ అధికారులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు అద నపు సొలిసిటర్ జనరల చల్ల ధనంజయ, అడ్వకేట్ జనరల్ డి.శ్రీనివా స్, బార్ కౌన్సిల్ అధ్యక్షుడు ద్వారకానాథ్‌రెడ్డి, అడ్వకేట్స్ అసోసి యేషన్ వైస్ ప్రెసిడెంట్ కె.వి.రఘువీర్ తదితరులు ప్రసంగిం చారు. ఈ గణతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పలువురు న్యాయ మూర్తులు, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్, పలువులు రిజిస్ట్రార్లు, బార్ అసోసియేషన్, బార్ కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శిరీషాదేవి



రంపచోడవరం (చైతన్యరథం): దేశం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనులను స్మరించుకోవటం శుభప్రదం అని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి అన్నారు. రంపచోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం గణతంత్ర వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రభుత్వ అధికారులు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై వివరించారు. అలాగే రంపచోడవరం నియోజకవర్గం వ్యాప్తంగా అమలు చేస్తున్న పనులు, పురోభివృద్ధి పనులపై వివరించారు. అలాగే వివిధ శాఖల వారు ఏర్పాటు చేసిన స్టాల్‌లను పరిశీలించారు. పోలీస్ శాఖ వారు నిర్వహించిన పెరేడ్ కార్యక్రమాన్ని వీక్షించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించారు. అలాగే స్వాతంత్ర సమర యోధుల కుటుంబ సభ్యులను సన్మానం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పెంటపాటి అనంత మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొన్న ఎంపీ కలిశెట్టి



విజయనగరం (చైతన్యరథం): దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవాల్లో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. దేశ రాజధానిలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని ఆయన చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో జరుగుతున్న వికసిత్ భారత్ 2047 కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## కార్యకర్తలకు టీడీపీ అండగా నిలుస్తుంది

**●కష్టకాలంలో సహకారం అందిస్తుంది : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**

**●మృతి చెందిన టీడీపీ కార్యకర్త కుటుంబానికి రూ. 5 లక్షల చెక్కు అందజేత**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ (టీడీపీ) తన కార్యకర్తలకు అండగా నిలుస్తుందని, కష్టకాలంలో సహకారం అందిస్తుందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేసినవారికి, మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలకు పక్షపాతం లేకుండా సహాయం అందిస్తుందని తెలిపారు.స్థానిక 9వ డివిజన్ బర్మా కాలనీ 3వ వీధికి చెందిన టీడీపీ కార్యకర్త బత్తిన సంతోష్ ప్రమాదవశాత్తూ ఇటీవల మృతి చెందారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, సంతోష్ పార్టీ సభ్యత్వ వివరాలతో కేంద్ర కార్యాలయానికి సమాచారం అందించి ప్రమాద బీమా మంజూరు చేయించారు. ఈ రోజు హౌసింగ్ బోర్డులో సంతోష్ తల్లి వద్ద ఉన్న సతీమణి భవ్య భారతికి రూ.5 లక్షల చెక్కును అందజేశారు. సంతోష్ మృతి పట్ల విచారం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, పార్టీకి విధేయుడై పని చేసిన మంచి కార్యకర్తను కోల్పోవడం బాధాకరమని అన్నారు. రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంలో గతంలో ప్రమాదాల్లో మరో నలుగురు కార్యకర్తలకు కూడా రూ.5 లక్షల చొప్పున బీమా చెక్కులు అందజేసినట్లు గుర్తు చేశారు. కష్టాల్లో ఉన్న కార్యకర్తలను ఆదుకోవడమే టీడీపీ సంప్రదాయమని, భవిష్యత్తులో ఏ సహకారం కావాలన్నా అందిస్తామని భవ్య భారతికి భరోసా ఇచ్చారు. నగర మహిళా కమిటీ అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**సమాజమే దేవాలయం - ప్రజలే దేవుళ్లు**

**"కార్యకర్తే అధినేత"**

## ఈనెల 29న అరకులోయలో సీఎం చంద్రబాబు పర్యటన

అరకులోయ (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 29వ తేదీన అరకులోయ రానున్నారు. గిరిజన సంప్రదాయాలను ప్రతిబింబించేలా నిర్వహించనున్న అరకు ఉత్సవాలను ఆయన లాంఛనంగా ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ దినేష్కుమార్ పరిశీలించారు. డిగ్రీ కళాశాల మైదానం వద్ద వివిధ స్టాళ్ల ఏర్పాటు, సభా వేదిక, టెంట్ల ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'ఈనెల 29న సీఎం చంద్రబాబునాయుడు హెలికాప్టర్లో అరకులోయ రానున్నారు. హెలిపాడ్ నుంచి తురాయిగుడలో నిర్వహిస్తున్న హోంస్టేని పరిశీలిస్తారు. అనంతరం కాఫీ తోటలను పరిశీలించి అక్కడ కాఫీ టూరిజంపై గిరిజనులతో చర్చిస్తారు. గిరిజన వంటకాలను రుచి చూస్తారు. అక్కడి నుంచి గిరిజన మ్యూజియం చేరుకుని.. అరకు ఉత్సవాలను ప్రారంభిస్తారు. అనంతరం కాఫీ మ్యూజియాన్ని సందర్శిస్తారు. ఉత్సవ వేదిక, డిగ్రీ కళాశాల మైదానంలో స్టాళ్లని పరిశీలించిన అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారు.

## అమరావతి నిర్మాణానికి క్యూఆర్ కోడ్ ద్వారా విరాళాల సేకరణ



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు ఏపీలోని కూటమి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. రాజధాని నిర్మాణంలో ప్రజలను భాగస్వామ్యం చేసే ఉద్దేశంతో విరాళాల సేకరణ ప్రారంభించింది. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక డిజిటల్ వ్యవస్థను కూడా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆన్‌లైన్ ద్వారా విరాళాల సేకరణ ప్రారంభించింది. రాజధాని నిర్మాణానికి ఆర్థిక సాయం చేయాలనుకునే దాతల కోసం APCRDA తన అధికారిక వెబ్‌సైట్ crda.ap.gov.inలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఆన్‌లైన్ విధానంలో విరాళాల సేకరణ కోసం సీఆర్డీఏ వెబ్‌సైట్‌లో Donate for Amaravati అనే ఆప్షన్ తెచ్చారు. ఒక క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశారు. అమరావతికి విరాళాలు అందించాలనుకునే దాతలు గూగుల్ పే, ఫోన్ పే లేదా పేటీఎం వంటి ఏదైనా UPI యాప్ ద్వారా ఈ కోడ్‌ను స్కాన్ చేసి నేరుగా సీఆర్డీఏ బ్యాంక్ ఖాతాకు నిధులను పంపవచ్చు.

**'మై బ్రిక్ - మై అమరావతి ' స్ఫూర్తితో..**

మరోవైపు గతంలోనూ అమరావతి నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. 2015లో రాజధాని నిర్మాణం కోసం'మై బ్రిక్ - మై అమరావతి' (My Brick - My Amaravati) కార్యక్రమాన్ని చేపట్టారు. అప్పట్లో ఒక్కో ఈ-ఇటుక ధరను రూ. 10గా నిర్ణయించగా, సామాన్యుల నుంచి సంపన్నుల వరకు వేలాది మంది స్పందించారు. ఎన్నారైలు సైతం ఈ - ఇటుకలను కొనుగోలు చేసి అమరావతి పట్ల తమ మమకారాన్ని చాటుకున్నారు. ఇప్పుడు మళ్ళీ అదే స్ఫూర్తిని రగిలించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.

## 12వ తేది వరకు ఏపీలో ప్రతిష్టాత్మకంగా ఏకీకృత కుటుంబ సర్వే



ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఏకీకృత కుటుంబ సర్వేలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సిగ్నలింగ్ సమస్యలు, సర్వర్ సమస్యల కారణంగా ఏకీకృత కుటుంబ సర్వే వేగంగా జరగని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఏకీకృత కుటుంబ సర్వే గడువును ప్రభుత్వం ఫిబ్రవరి పదో తేదీ వరకూ పొడిగించింది. అలాగే ఆఫ్‌లైన్ విధానంలోనూ ఏకీకృత కుటుంబ సర్వే చేసే అవకాశం ఇచ్చే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఈ నెలాఖరు నుంచి ఆఫ్‌లైన్ అవకాశం ఇవ్వనున్నట్లు తెలిసింది. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఏకీకృత కుటుంబ సమగ్ర సర్వే ప్రారంభించిన సంగతి తెలిసిందే. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. వాలంటీర్ల ద్వారా ఇంటింటి సర్వేలో కుటుంబసభ్యుల సమాచారం సేకరించారు. అయితే ఈ సర్వే మ్యాపింగ్ సమయంలో తప్పులు దొర్లినట్లు ప్రభుత్వం చెప్తోంది. ఈ నేపథ్యంలో అర్హత ఉన్నప్పటికీ చాలా మందికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి అందడం లేదని చెప్తోంది. ఈ నేపథ్యంలోనే డిసెంబర్ నెలలో ఏకీకృత కుటుంబ సర్వే ప్రారంభించారు. డిసెంబర్ నెలలో రాష్ట్రవ్యాప్తంగా ఈ సర్వే ప్రారంభమైంది. వివిధ కారణాలతో కొన్నిచోట్ల ఆలస్యంగా ప్రారంభమైంది. 30 రోజుల పాటు సర్వే చేపట్టాలని తొలుత నిర్ణయించారు. ఈ లెక్కన జనవరి 12వ తేదీ వరకూ ఏకీకృత కుటుంబ సర్వేను చేపట్టాలని అధికారులు తొలుత నిర్ణయం తీసుకున్నారు. అయితే సాంకేతిక సమస్యల కారణంగా ఏకీకృత కుటుంబ సర్వే ఆలస్యమవుతోంది.

## వినూత్న రీతిలో విశాఖ స్కూబా డ్రైవర్ల దేశభక్తి



విశాఖపట్నం (చైతన్యరథం): దేశమంతా గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకుంటుంది. వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలాడుతోంది. వేడుకలతో భారతజాతి పులకించిపోయింది. ఇంతటి మహత్తర రోజున.. విశాఖ సాగరంలో మరో అరుదైన దృశ్యం కనువిందు చేసింది. సాగర గర్భంలో మువ్వన్నెల జెండాను ఆవిష్కరించి దేశభక్తిని చాటుకున్నారు స్కూబా డైవర్లు. నీటి అడుగున జెండా చేత పట్టుకుని గుర్రంపై స్వారీ చేస్తున్నట్టు ఇద్దరు స్కూబా డ్రైవర్లు ప్రదర్శన చేసి ఔరా అనిపించారు. విశాఖలో స్కూబా డ్రైవర్లు దేశభక్తిని వినూత్నంగా చాటుకున్నారు. మువ్వన్నెల జెండాను సముద్ర గర్భంలో ఆవిష్కరించారు. 77 ఏళ్ల గణతంత్ర దినోత్సవ సందర్భంగా.. 77 అడుగుల లోతు సముద్ర గర్భంలో జాతీయ జెండా నీటిలో రెపరెపలాడింది. నేవి మాజీ అధికారి, స్కూబా ఇన్‌స్ట్రక్టర్ బలరాం నాయుడు నేతృత్వంలో అయిదుగురు సభ్యుల బృందం ఈ ఘనతను సాధించారు.

**రుషికొండ తీరం నుంచి కొద్ది దూరం బోటులో..** వెళ్లి సముద్రంలో డైవ్ చేసి దేశభక్తిని చాటారు. దాదాపు అరగంట పాటు సముద్రంలోనే జాతీయ జెండాతో ఉన్నారు. ఇద్దరు స్కూల్ డ్రైవర్లలో ఒకరు.. గుర్రంలా, మరొకరు జాతీయ జెండా చేత పట్టుకొని ఆ గుర్రంపై స్వారీ చేస్తున్నట్టు అద్భుత ప్రదర్శన చేశారు. ధైర్యం క్రమశిక్షణ రాజ్యాంగం పట్ల గౌరవాన్ని సూచిస్తూ జాతీయ జెండాతో ఈ ప్రదర్శన చేశామని అంటున్నారు బలరాంనాయుడు. ఈ మొత్తం కార్యక్రమానికి దాదాపు రెండు గంటల సమయం పట్టిందని.. సముద్రంలో అరగంట పాటు జాతీయ జెండా ప్రదర్శించామని బలరామ్ నాయుడు వివరించారు. జాతీయ జెండాను తీసుకెళ్లడం సముద్రంలో 77 అడుగుల లోతులో ఆవిష్కరించడంతో పాటు.. అక్కడ వరకు స్కూబా డైవింగ్ కిట్లతో వెళ్లి.. ఈ అద్భుత ఘట్టాన్ని కెమెరాలో షూట్ చేయడం మరో విశేషం.

# పౌరులంతా రాజ్యాంగ విలువలను పాటించాలి : ఎమ్మెల్యే బడేటి



ఏలూరు (చైతన్యరథం): దేశ రాజ్యాంగ విలువలను మరింత ఇనుమడింపచేసే విధంగా పౌరులంతా నడుచుకోవాలని, అప్పుడే సుస్థిరత, సౌభ్రాతృత్వం సాకారమై అందరూ ఆశించిన విధంగా అభివృద్ధి చెందిన దేశంగా ఉజ్వల భారత్ వెలుగొందుతుందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అభిప్రాయపడ్డారు. భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌తో పాటూ ఇతర ప్రముఖులందరి ఆశయాల సాధనకు ప్రజలు సమిష్టిగా ముందుకెళ్ళాలని ఆయన పిలుపునిచ్చారు. 77వ భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరులోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో టీడీపీ జిల్లా అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలుత టీడీపీ జిల్లా అధ్యక్షులు బడేటి చంటి జాతీయ పతాకావిష్కరణ చేశారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ... ప్రజలందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రాజ్యాంగాన్ని రూపొందించి, అమల్లోకి తెచ్చీ, స్వాతంత్ర్య ఫలాలను అందరికీ అందించిన మహనీయుల ఆశయ సాధనకు పునరంకితం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, బిఎస్ఎన్ఎల్ అడ్వైజరీ బోర్డు కమిటీ మెంబర్ లంకపల్లి మాణిక్యాలరావు, శనివారం పేట సొసైటీ బ్యాంక్ చైర్మన్ కోనేరు వంశీ, టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి రెడ్డి నాగరాజు, మరియు వివిధ హోదాల్లో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం మన దేశ విధానం

**●భిన్నత్వంలో ఏకత్వమే మన ఘనత... గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**



కొత్తపేట (చైతన్యరథం): ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం, పెద్ద రాజ్యాంగం, చెక్కుచెదరని రాజ్యాంగం కలిగిన దేశం భారతదేశమని, దేశానికి దశా, దిశా నిర్దేశం చేసిన గొప్ప రాజ్యాంగాన్ని అమలుపరచుకున్న రోజు జనవరి 26 అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం వాడపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. దేశభక్తిని పెంపొందించే విధంగా నాటి స్వాతంత్ర సమరయోధులు, మహనీయుల యొక్క వేషధారణలో బాలలను తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. స్వాతంత్ర సమరయోధులు, రాజ్యాంగ నిర్మాతలను తలచుకుని వారి అడుగుజాడల్లో రాజ్యాంగ స్ఫూర్తితో పయనించడమే ఆ మహానుభావులకు మనమిచ్చే నివాళి అన్నారు. దేశం కోసం త్యాగం చేసిన మహనీయుల ఆశయాలను పుణికి పుచ్చుకుని ముందుకు వెళ్లాలన్నారు. గాంధీజీ, నెహ్రూజీ, సుభాష్ చంద్రబోస్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్,ఝాన్సీ లక్ష్మీబాయి, అల్లూరి సీతారామరాజు వంటి స్వాతంత్ర సమరయోధులందరినీ స్మరించుకుని వారి బాటలో పయనించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. మన దేశం యొక్క గొప్పతనం స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అన్నారు. భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ ఘనతన్నారు. వివిధ మతాలు, జాతులు, కులాలు, భాషలు ఉన్నా మనందరం ఒక్కటే అని, మనమంతా భారతమాత ముద్దుబిడ్డలమని, మనది భారత జాతి..ఆ తరువాతే మరేదైనా..ఏమైనా అనేది గుర్తించుకోవాలన్నారు. అందరూ కలిసికట్టుగా అభివృద్ధి చెంది, దేశ ఐక్యతకు కృషి చేయాలన్నారు. నేటి విద్యార్థులంతా భావి భారత పౌరులుగా ఈ భావనలన్నీ ప్రోది చేసుకొని దేశ సేవకు పునరంకితం కావాలన్నారు.

# అంబేడ్కర్ స్ఫూర్తి... గణతంత్ర కీర్తి... రిపబ్లిక్ వేడుకల్లో ఎమ్మెల్యే వేగుళ్ళ



మండపేట (చైతన్యరథం): రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డాక్టర్ భీమ్ రావ్ అంబేద్కర్ స్ఫూర్తి యువతలో అణువణువున ఉండాలని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మండపేట పుర కార్యాలయం వద్ద భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. మూడేళ్ల పాటు బ్రిటిష్ రాజ్యాంగమే అమలు కాగా 1950 జనవరి 26న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ నిర్మించిన భారత రాజ్యాంగం అమల్లో కొచ్చిందన్నారు. తమ బాల్యంలో పంద్రాగస్ట్, జనవరి 26 తేదీల్లో పండుగలా భావించేవారమని పేర్కొన్నారు. రాజ్యంగ నిర్మాత బాబా సాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. మండపేట నియోజకవర్గం తూర్పు గోదావరి జిల్లాలో విలీనం అయిన తర్వాత తొలి గణతంత్ర దినోత్సవం నిర్వహించుకుంటున్నామని ఆనందం వ్యక్తం చేశారు. అభివృద్ధిలో మండపేట మున్సిపాల్టీ రాజమహేంద్రం సిటీను, రూరల్ గ్రామాలు రాజమహేంద్రవం రూరల్‌తో పోటీపడాలని కోరారు. అభివృద్ధిలో నియోజకవర్గం నెంబర్‌వన్ స్థానంలో ఉండాలని ఆకాక్షించారు. మునిసిపల్ కమిషనర్ టివి రంగారావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్‌లు పిల్లి గణేశ్వరరావు, వేగుళ్ల నారాయణరావు, కౌన్సిలర్లు యరమాటి గంగరాజు, కొవ్వాడ బేబీ, కాళ్ళకూరి స్వరాజ్య భవాని, బొక్కా సరస్వతి, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఏలూరులో రోజురోజుకీ పెరిగిపోతున్న పెద్దపులి భయం

ఏలూరు (చైతన్యరథం): ఏపీలో పెద్దపులి భయాందోళన రోజురోజుకీ పెరిగిపోతోంది. ఇప్పటికే పదుల సంఖ్యలో ఆవులు, గేదెలు, దూడలను పెద్దపులి పొట్టన పెట్టుకోవడంతో ప్రజల్లో ఒకవైపు భయం, మరోవైపు అధికారుల్లో ఉత్కంఠ నెలకొంది. తెలంగాణ ప్రాంతంలో గత కొద్ది రోజులుగా కలకలం రేపిన పెద్దపులి ఇప్పుడు ఏపీ సరిహద్దుల్లోకి ప్రవేశించిందన్న ప్రచారం మరింత ఆందోళన కలిగిస్తోంది. తాజాగా ఏలూరు జిల్లాలో దాదాపు రోజుకు ఒక ప్రాంతంలో పెద్దపులి దాడి జరుగుతుండటంతో అసలు ఈ పెద్దపులి ప్రస్తుతం ఎక్కడ ఉంది తర్వాతి కదలిక ఏమిటి అన్న ప్రశ్నలు చర్చనీయాంశంగా మారాయి. నిన్న మొన్నటి వరకు తెలంగాణలో సంచరించిన పెద్దపులి తాజాగా ఏలూరు జిల్లాలోని బుట్టాయిగూడెం సమీప ప్రాంతాల్లో ప్రత్యక్షమైందని ఫారెస్ట్ అధికారులు భావిస్తున్నారు. అంతర్వేదిగూడెం, నాగులగూడెం, బుట్టాయిగూడెం పరిసరాల్లో ఇప్పటివరకు పదుల సంఖ్యలో ఆవులు, గేదెలపై దాడి చేసి వాటిని హతమార్చింది. దీంతో అప్రమత్తమైన అటవీ శాఖ అధికారులు పెద్దపులిని బంధించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. బుట్టాయిగూడెం పరిసరాల్లో ఇప్పటికే 40 నిఘా కెమెరాలను ఏర్పాటు చేసి పులి కదలికలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.

# దళిత వర్గాల అభ్యున్నతే ప్రధాన అజెండ

**●అంబేద్కర్, జగ్గజీవన్‌రామ్‌ల విగ్రహాల స్లాబ్ నిర్మాణ పనుల్లో శ్రామదానం చేసిన మంత్రి నిమ్మల రామానాయుడు**



పాలకొల్లు (చైతన్యరథం): డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగజీవన్ రామ్‌ల స్ఫూర్తితో ఎస్సీల సంక్షేమం అభివృద్ధియే ప్రధాన అజెండాగా పనిచేస్తున్నానని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులోని తాసిల్దార్ కార్యాలయ సమీప ప్రాంతంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహాల స్లాబు నిర్మాణ పనులను ప్రారంభించి పనుల్లో స్వయంగా శ్రమదానం చేశారు. కార్మికులతో కలిసి కంకర, ఇసుక, సిమెంట్ గమేళాలను నెత్తి మీద పెట్టుకొని మోసి మిల్లర్లో వేశారు. స్లాబ్ పిల్లర్ల నిర్మాణ పనిలో కాంక్రీట్ పోశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ... 2014లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన అప్పటి నుంచి ఎస్సీల పక్షపాతిగా పనిచేస్తున్నానన్నారు. అందులో భాగంగానే మహానుభావులైన డాక్టర్ బి.ఆర్‌అంబేద్కర్, బాబు జగజ్జీవన్ రామ్‌ల విగ్రహాలు ఎండలో వానలో తడవకుండా రక్షణ కల్పించేందుకే సుందరవణంగా స్లాబ్లు ఏర్పాటు చేయాలనేది లక్ష్యం అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిగా దళిత గ్రామం ఆర్య పేటలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, జగజ్జీవన్ రామ్‌ల విగ్రహ స్లాబ్ నిర్మాణ పని ప్రారంభించి శ్రమదానం చేశానని గుర్తు చేశారు. పాలకొల్లు నియోజకవర్గంలో అంబేద్కర్, బాబు జగజ్జీవన్‌రామ్‌ల విగ్రహాలన్నిటికి దశలవారీగా స్లాబుల నిర్మాణం చేపట్టి సుందరీకరణగా తీర్చిదిద్దుతానని, వీరి ఆశయాలు అందరికీ ఆదర్శమన్నారు. నాడు జగన్ ఎస్సీల ఓట్లతో అధికారంలోకి వచ్చి, ఎస్సీల సంక్షేమాన్ని అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో,ఎస్సీ ప్రాంతాలను అభివృద్ధిపరిస్తే, జగన్ ప్రభుత్వం రద్దు చేసి నిధులను పక్కదారికి మళ్ళించిందన్నారు. చంద్రబాబు ఎస్సీల అభివృద్ధికి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ బడ్జెట్లో రూ.వేల కోట్లు కేటాయించారన్నారు. దళిత వ్యక్తి జిఎంసి బాలయోగిని లోక్‌సభకు స్పీకర్‌గా ప్రతిభ భారతిని శాసనసభ స్పీకర్‌గా అత్యున్నత పదవులు ఇచ్చింది చంద్రబాబే అని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చీఫ్ సెక్రటరీగా దళిత బిడ్డ కాకి మాధవరావును, ఎస్సీ కమిషన్‌ను ఏర్పాటు చేసి జస్టిస్ పున్నయ్యను నియమించారు. నేషనల్ ఫ్రంట్ చైర్మన్ ఎన్టీఆర్ ఉండగానే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కు భారతరత్న ఇచ్చి గౌరవించారని మంత్రి రామానాయుడు గుర్తుచేశారు. నా ఎస్సిలు అంటూ వారి నిధులను పక్క దారి పట్టించి అడ్డగోలుగా దోచుకున్న ఎస్సీల ద్రోహి జగన్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విజయ్ సారథి, సనమండ ఎబినేజర్, ఉందుర్తి సురేష్,పసుపులేటి రాజేష్ ఖన్నా, ఉన్నమట్ల కబర్ధి, పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, బోనం చినబాబు, పొట్నూరి శ్రీనివాస్, మీసాల రాము, మహమ్మద్ జానీ, ధనాన్ని సూర్యప్రకాష్, బిరుదుకోట శేఖర్, మల్లంపల్లి ఫకీర్ బాబు, జగ్రోతు రాంబాబు, మండేలా రాంప్రసాద్, మకల బుచ్చిరాజు, సలాది సత్తియ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.



# జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే అయితాబత్తుల



అమలాపురం (చైతన్యరథం): 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని అమలాపురం నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం సమర్పించారు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిరుపేదలకు వైద్య సేవలు అందించే ప్రభుత్వ ఆసుపత్రి వంటి పవిత్ర ప్రాంగణంలో జెండా ఎగురవేయడం సంతోషకరమని, రోగులకు మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే తెలిపారు. రాజ్యాంగం కల్పించిన ఫలాలను సమాజంలోని అట్టడుగు వర్గాలకు చేరవేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. నిరంతరం ప్రజా సేవలో నిమగ్నమయ్యే వైద్యులు, సిబ్బందిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, సిబ్బందితో పాటు కూటమి నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి భారతీయుడికి రాజ్యాంగమే పవిత్ర గ్రంథం

◆ గుంటూరు పశ్చిమ టీడీపీ కార్యాలయంలో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గళ్లా మాధవి



గుంటూరు (చైతన్యరథం): ప్రతి భారతీయుడికి పవిత్ర గ్రంథం రాజ్యాంగమే అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. సోమవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయం (శ్రీనివాసరావుపేట)లో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే గళ్లా మాధవి పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భారతీయ రాజ్యాంగంలోని ప్రాథమిక విధులపై ప్రజల్లో అవగాహన కల్పించేలా రూపొందించిన కరపత్రాన్ని ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ... భారతీయులుగా మనమందరం ఎంతో గర్వంగా 77వ గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, 1947లో స్వాతంత్ర్యం పొందిన భారత్, రెండున్నర సంవత్సరాల తర్వాత 1950లో రాజ్యాంగాన్ని అమల్లోకి తీసుకొచ్చి గణతంత్రంగా అవతరించిందని గుర్తుచేశారు. స్వేచ్ఛ అనేది బాధ్యతలతో కూడినదై ఉండాలని, బాధ్యతారాహిత్యమైన స్వేచ్ఛ ప్రమాదకరమని భావించే స్ఫూర్తే గణతంత్ర దినోత్సవమని ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. ఎన్నో త్యాగాలు, కష్టాలు, బానిసత్వాలు అనుభవించి స్వాతంత్ర్యం సాధించిన స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ, వారి ఆశయాలకు అనుగుణంగా దేశాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని, భారత రాజ్యాంగం ప్రతి భారతీయుడికి పవిత్ర గ్రంథం వంటిదని, మన హక్కులతో పాటు మనం నిర్వర్తించాల్సిన విధులను కూడా రాజ్యాంగం స్పష్టంగా చెప్పిందని ఎమ్మెల్యే గళ్లా మాధవి గుర్తు చేశారు. కుల, మత, భేదభావాలు లేకుండా సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం అనే మూల సూత్రాలతో డా. బి.ఆర్. అంబేద్కర్ నేతృత్వంలో రూపొందిన ఈ రాజ్యాంగం వల్లే భారతదేశం ప్రజల చేత, ప్రజల కోసం, ప్రజల ద్వారానే నడిచే గణతంత్ర దేశంగా నిలిచిందన్నారు.

## రాజ్యాంగ స్ఫూర్తితో ముందుకెళ్లాలి

●ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ



విజయవాడ (చైతన్యరథం): ప్రాథమిక హక్కులు రాజ్యాంగం మనకు కల్పించిన ఆయుధాలని, ప్రతి ఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా నడుచుకోవాలని తెలుగుదేశం పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ అన్నారు. గురునానక్ కాలనీలోని ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో గద్దె అనురాధ ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించి, ప్రజలందరికీ 77వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గద్దె అనురాధ మీడియాతో మాట్లాడుతూ... ప్రాథమిక హక్కుల పునాదే రాజ్యాంగమన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావాలు మూలస్తంభాలుగా అన్ని విధాలుగా ప్రజల అభివృద్ధిని కోరుకునే సమున్నత ఆశయమే రాజ్యాంగమని వివరించారు. 76 సంవత్సరాల క్రితం ఇదే రోజు మన రాజ్యాంగం అమల్లోకి వచ్చిందని, భారతదేశం ఒక స్వయం పరిపాలిత దేశంగా మారిందని అన్నారు. భారత దేశం విభిన్న సంస్కృతితో కూడిన నిలయమన్నారు. భిన్నత్వంలో ఏకత్వం మన నినాదమంటూ దేశ ప్రజలకు ఉన్న హక్కులను రాజ్యాంగం ద్వారా అంబేద్కర్ ఈ దేశ ప్రజలకు అందించారని అన్నారు.

## గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న మన్నవ మోహనకృష్ణ



గుంటూరు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతిలో తొలిసారిగా జరిగిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా మరియు ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్, మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం 77వ భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో మన్నవ మోహనకృష్ణ పాల్గొన్నారు.

## గుంటూరులో ఘనంగా గోనుగుంట్ల జన్మదిన వేడుకలు



గుంటూరు (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీలో కోటేశ్వరరావుది చెరగని ముద్ర అన్నారు శ్రీశైలం దేవస్థానం బోర్డు సభ్యులు బోడేపూడి వెంకట సుబ్బారావు అన్నారు. గుంటూరు క్యాపిటల్ హోటల్ గెస్ట్ హౌస్‌లో ఏపీ గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు జన్మదిన వేడుకలు ఆయన అభిమానులు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఏపీ శిల్పకళ వేదికలు ఛైర్మన్ మంజులత రెడ్డి, గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ భీమనేని వందనాదేవి, సత్తెనపల్లి టీడీపీ నాయకులు మన్నెం శివ నాగ మల్లేశ్వరరావు, ఏపీ గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ పద్మజ పాల్గొన్నారు.

## సంస్కారం లేని సన్నాసులు వైసీపీ నేతలు... టీడీపీ నేతల మండిపాటు



మచిలీపట్నం (చైతన్యరథం): ఎంతో మంది మహానుభావులు నడయాడిన కృష్ణాజిల్లా ప్రతిష్టను వైసీపీ నేతలు భ్రష్టు పట్టిస్తున్నారని మచిలీపట్నంకు చెందిన కూటమి నాయకులు ధ్వజమెత్తారు. ప్రజల చేతుల్లో తన్నులు తినడానికి ముందే నోటి దురుసు తగ్గించుకోవాలని వార్నింగ్ ఇచ్చారు. సోమవారం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మోటమర్రి బాబాప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో సంస్కారవంతంగా మాట్లాడాలన్న విషయాన్ని పేర్ని నాని గుర్తుంచుకోవాలన్నారు. కొల్లు రవీంద్రపై, చంద్రబాబుపై, నారా లోకేశ్‌పై బురద జల్లి తానేదో గొప్పోడిని అనిపించుకోవాలని పేర్ని నాని ఆపసోపాలు పడుతున్నాడన్నారు. బందరు పోర్టును పూర్తి చేస్తున్నాం. మా సత్తా ఏంటో చూపిస్తాం. జగన్‌రెడ్డి ముందు గొప్పోడిగా కనిపించడం కోసం బూతులు తిడితే తోలు వలిచేస్తామన్నారు. ఇలానే వ్యవహరిస్తే తగిన గుణపాఠం చెబుతామని, పేదల బియ్యం బొక్కేసి నీతులు చెబుతుండడం సిగ్గుచేటు అని అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ రొండి కృష్ణ యాదవ్ మాట్లాడుతూ.. ప్రజలిచ్చిన తీర్పుతో పేర్ని నాని మానసిక స్థితి అగమ్యగోచరంగా తయారైనట్లుందన్నారు. రాజకీయ నపుంసకుడివి అంటూ మాట్లాడే ముందు అర్థం తెలుసుకోవాలన్నారు. రాజకీయాల్లో హుందాతనం అవసరం అని, ఆ విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఒక బీసీ వర్గానికి చెందిన మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారధిపై బూతులు తిడతామంటే చూస్తూ ఊరుకోమన్నారు. పనీ పాట లేక నీకు భజన చేసే వారిని పిలుచుకుని కథలు చెబుతున్నావ్. నీ అరాచకాలన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారన్నారు. రాష్ట్రంలోని బీసీలంతా ఏకమై నీకు సరైన గుణపాఠం చెప్పడం తథ్యమన్నారు.

జనసేన పార్టీ జిల్లా నాయకులు మాదివాడ రాము మాట్లాడుతూ.. రాజకీయాల్లో ఉన్నప్పుడు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని. ఆ విషయం తెలియకుండా అడ్డగోలుగా వాగినందునే ప్రజలు నిన్ను భూస్థాపితం చేశారన్నారు. అయినప్పటికీ పేర్ని నాని నోటి దురద తగ్గకుండా అదే స్థాయిలో వాగుతున్నాడని, గతంలో కాంగ్రెస్ నుండి వైసీపీకి ఏ విధంగా వచ్చావో ప్రజలందరికీ తెలుసు అన్నారు. నీకు నీతి న్యాయం, విశ్వాసం అనే పదాలకు అర్థం తెలుసా..? అవకాశవాద రాజకీయాలు చేయడం తప్ప నీకు ఏమాత్రమైనా నీతి ఉందా..? బీసీ వర్గాలకు చెందిన మంత్రులు, వ్యాపారవేత్తలపై విమర్శలు చేస్తే చర్యలు తప్పవన్నారు.

## వేమూరులో బాబు జగ్జీవన్‌రాం విగ్రహ ఆవిష్కరణ



వేమూరు (చైతన్యరథం): భట్టిప్రోలు మండలం వెల్లటూరు ఉత్తర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారతదేశ మాజీ ఉప ప్రధాని, మహానాయకుడు బాబు జగ్జీవన్‌రాం కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన జగ్జీవన్‌రాం విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ... బాబు జగ్జీవనరాం సామాజిక న్యాయం, సమానత్వం, దళితుల అభ్యున్నతికి చేసిన సేవలు దేశ చరిత్రలో చిరస్మరణీయమని పేర్కొన్నారు. సమాజంలోని అణగారిన వర్గాలకు గౌరవప్రదమైన స్థానం కల్పించేందుకు ఆయన చేసిన కృషి నేటి తరానికి మార్గదర్శకమని అన్నారు. ఈ కార్యక్రమంలో భట్టిప్రోలు మండల పరిధిలోని కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విగ్రహ ఆవిష్కరణ అనంతరం నాయకులు పూలమాలలు సమర్పించి మహానాయకుడికి ఘన నివాళులు అర్పించారు. వెల్లటూరు గ్రామంలో ఈ కార్యక్రమం సామాజిక చైతన్యానికి ప్రతీకగా నిలిచింది.

## అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుంది

● కూటమి శ్రేణులతో కలిసి జాతీయ పతాకాన్ని ఎగురవేసిన ఎమ్మెల్యే రాము



గుడివాడ (చైతన్యరథం): భారతరత్న అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా, ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపేలా కూటమి సర్కారు పని చేస్తుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గుడివాడ తెలుగుదేశం పార్టీ కార్యాలయం ప్రజా వేదికలో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కూటమి పార్టీల నేతలతో కలిసి ఎమ్మెల్యే రాము జాతీయ జెండాను ఎగరవేసి... పతాక వందనం చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి ఎమ్మెల్యే రాము మరియు కూటమి నేతలు పూలమాలలతో నివాళు లర్పించి.... జోహార్ అంబేద్కర్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మీడియాతో మాట్లాడుతూ ... సీఎం చంద్రబాబు స్ఫూర్తితో... గుడివాడ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నామన్నారు.గుడివాడ అభివృద్ధికి.... స్వచ్ఛ గుడివాడ రూపకల్పనకు తాము చేస్తున్న కృషికి ప్రజలు కూడా తమ వంతు సహకారం అందించాలని ఎమ్మెల్యే రాము విజ్ఞప్తి చేశారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, పలువురు టీడీపీ నాయకులు, అనుబంధ విభాగాల నేతలు, కూటమి పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు. నందివాడ రూరల్ మండల టీడీపీ అధ్యక్షులు దానేటి సన్యాసిరావు, వాసే మురళి, జనసేన ఇన్‌ఛార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, టీడీపీ నాయకులు పిన్నమనేని బాబ్జి, మజ్జాడ నాగరాజు, పంద్రాజు సాంబశివరావు, కూటమి నాయకులు, తెలుగు మహిళ, తెలుగు యువత, అనుబంధ విభాగాల నాయకులు, పెద్ద సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# టెంపుల్ టూరిజం అభివృద్ధికి ప్రత్యేక కృషి

## రాష్ట్రస్థాయిలో తొలిసారిగా రూపొందించిన టెంపుల్ కారవ్యాన్‌ను ప్రారంభించిన మంత్రి ఆనం



నెల్లూరు, (చైతన్యరథం): భక్తులకు సకల సౌకర్యాలతో రూపొందించిన కారవాన్ వాహనాన్ని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించారు. సోమవారం ఉదయం నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో పర్యాటకశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే తొలిసారిగా రూపొందించిన ఈ కారవాన్‌ను మంత్రి ప్రారంభించి, కారవాన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు గొప్ప అనుభూతిని కలిగించే కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటకశాఖ శ్రీకారం చుట్టడం సంతోషదాయకమని మంత్రి ఆనం అన్నారు. ఈ కారవాన్?ను నెల్లూరువాసి అయిన వై శ్రీనివాసరెడ్డి ఏర్పాటుకు ముందుకు రావడం పట్ల మంత్రి అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా టూరిజంశాఖ ఆధ్వర్యంలో ప్రైవేటుభాగస్వామ్యంతో ఈ కారవాన్‌లను ప్రారంభించి పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు భక్తులకు వెసులుబాటు కల్పించనున్నట్లు మంత్రి ఆనం స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబునాయుడు టెంపుల్ టూరిజంను అభివృద్ధి చేయాలని, ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలను టూరిజం సర్క్యూట్?లుగా అభివృద్ధిచేసేందుకు చర్యలు చేపట్టారన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో టెంపుల్ టూరిజాన్ని అభివృద్ధి చేసేందుకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నేతృత్వంలో తాను, పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, ఆరఅండ్?బి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డితో సీఎం ఒక సబ్ కమిటీని నియమించినట్లు మంత్రి ఆనం చెప్పారు. ఇప్పటికే ఈ కమిటీ ఒకసారి సమావేశమై టూరిజం అభివృద్ధిపై చర్చించినట్లు చెప్పారు. మన రాష్ట్రంలోని పుణ్యక్షేత్రాల సమాచారాన్ని, వసతి సౌకర్యాలను అన్నీ కూడా భక్తులు సులభంగా అర్థమయ్యేలా ఒక వెబ్‌సైట్‌లో టూరిజం సర్క్యూట్‌లను ఏర్పాటుచేసి పర్యాటకరంగ అభివృద్ధికి ప్రభుత్వం దృఢసంకల్పంతో పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి ఉషశ్రీ, తదితరులు పాల్గొన్నారు.



రిపబ్లిక్ డే ఉత్సవాల్లో సహచర ఎమ్మెల్యేలు కందుల నారాయణ రెడ్డి, ముత్తుముల అశోక్ రెడ్డి, యర్రగొండపాలెం ఇన్చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు, ఇతర నేతలు అధికారులతో కలసి పాల్గొన్న ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి




# కావలి ఎమ్మెల్యే పాదయాత్ర

## తరలి రావాలని టీడీపీ శ్రేణులకు పిలుపు

కావలి, (చైతన్యరథం): కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి కావలి పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నుండి కావలి రూరల్ మండలం కొత్తపల్లి గ్రామంలో మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో స్థాపించిన 2000 కిలోమీటర్ల మైలు రాయి (పైలాన్) వరకు స్ఫూర్తి యాత్ర నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పాల్గొంటున్నారు. యువగళం పాదయాత్ర ప్రారంభమై మూడు సంవత్సరాలు అయిన సందర్భంగా ఈ స్ఫూర్తి యత్రా కార్యక్రమం కావలి ఎమ్మెల్యే నిర్వహిస్తున్నారు. కావలి నియోజకవర్గ తెలుగుదేశం, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తప్పకుండా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# టీడీపీ నేత జాకీర్ లేనిలోటు పూడ్చలేనిది



నెల్లూరు, (చైతన్యరథం): మంచి వ్యక్తిత్వం ఉన్న నాయకుడు జాకీర్ మృతి తీవ్రంగా బాధించిందని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఇటీవల రహదారి ప్రమాదంలో మృతి చెందిన జాకీర్ కుటుంబ సభ్యులను సోమవారం రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ గారితో కలిసి నగరంలోని జాకీర్ ఇంటికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. జాకీర్ అందించిన సేవలు, తనతో ఉన్న అనుబంధాన్ని ఎంపీ గుర్తు చేసుకున్నారు. జాకీర్ పార్టీ బలోపేతానికి ఎంతో కష్టపడి పనిచేశారన్నారు. మైనార్టీ జనరల్ సెక్రటరీగా కూడా పదవి పొందారన్నారు. ఇలాంటి సమయంలో జాకీర్ అకాల మృతి ఆవేదన కలిగించిందన్నారు. జాకీర్ అన్న ఉస్మాన్ షరీఫ్ ఆ కుటుంబానికి అండగా నిలవడం సంతోషకరమని చెప్పారు. ఎన్నికల సమయంలో అలుపెరగకుండా పనిచేశారని గుర్తు చేశారు. ఇలాంటి వ్యక్తులను మళ్లీ చూడలేమని అన్నారు. ఇలాంటి సమయంలో ఆ కుటుంబానికి తాము అండగా ఉంటామని, ఎప్పుడు ఎలాంటి సహాయం కావాలన్నా తాము చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి మేయర్? రూప్ కుమార్ యాదవ్, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, మదీన వాచ్ ఇంతియాజ్, సయ్యద్ ఇంతియాజ్, స్థానిక ముస్లిం మైనార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి నారాయణ చొరవ..!

## కువైట్ నుంచి నెల్లూరుకు చేరిన షహనాజ్ భౌతికకాయం





నెల్లూరు, (చైతన్యరథం): ”కష్టం వస్తే కాపాడేవాడే నాయకుడు.. కన్నీరు తుడిచేవాడే అసలైన మనిషి. కువైట్‌లో ప్రాణాలు కోల్పోయిన ఓ పేద తల్లి భౌతికకాయాన్ని స్వదేశానికి తీసుకురావడంలో ఏపీ మంత్రి నారాయణ చూపిన చొరవ ఇప్పుడు అందరినీ కదిలిస్తోంది. తన బిడ్డలను చూడకుండానే కన్నుమూసిన ఆ తల్లికి, కనీసం అంతిమ సంస్కారాలైనా దక్కాలని మంత్రి నారాయణ సొంత ఖర్చులతో ఆమె మృతదేహాన్ని నెల్లూరుకు తెప్పించి మానవత్వం చాటుకున్నారు. విధి ఆడిన వింత నాటకంలో ముగ్గురు ఆడబిడ్డలు అనాథలయ్యారు. పొట్టకూటి కోసం సుదూర తీరాలకు వెళ్ళిన నెల్లూరుకు చెందిన షహనాజ్, కువైట్‌లో అకస్మాత్తుగా మరణించింది. కనీసం ఆ తల్లి ముఖాన్ని చివరిసారి చూసుకునే స్తోమత కూడా లేని నిరుపేద కుటుంబం అది. మృతదేహం వస్తుందో రాదో తెలియక, దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ కుటుంబానికి మంత్రి నారాయణ రూపంలో దేవుడు కనిపించాడు... షహనాజ్ మరణవార్త తెలుసుకున్న 54వ డివిజన్ క్లస్టర్ ఇంచార్జి జహీర్ మంత్రి నారాయణకు తెలియచేశారు. వెంటనే మంత్రి నారాయణ చలించిపోయారు. కేవలం ఒక ఫోన్ కాల్‌కే స్పందించిన ఆయన, రాజకీయ నాయకుడిలా కాకుండా ఒక కుటుంబ సభ్యుడిలా ఆలోచించారు. వెంటనే కువైట్ ఎంబసీ అధికారులతో మాట్లాడి, నిబంధనల చిక్కుముడులను విప్పించారు. విదేశాల నుంచి భౌతికకాయాన్ని తీసుకురావడానికి అయ్యే భారీ ఖర్చును ఏ ప్రభుత్వ నిధుల నుంచో కాకుండా.. తన సొంత ఖర్చుల నుంచి చెల్లించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. మంత్రి ఏర్పాటు చేసిన అంబులెన్స్ నెల్లూరులోనే ఆమె స్వగృహానికి చేరుకోగానే అక్కడి వాతావరణం గంభీరంగా మారింది. “అమ్మా.. లే అమ్మా..” అంటూ ముగ్గురు కూతుళ్లు చేసిన ఆర్తనాదాలు అక్కడున్న వారి గుండెలను పిండేశాయి. ఈ కన్నీటి సంద్రంలో మంత్రి నారాయణ చేసిన సాయం ఆ కుటుంబానికి కొండంత అండగా నిలిచింది. ఒక పేద కుటుంబం పడుతున్న ఆవేదనను అర్థం చేసుకుని, క్షణాల్లో స్పందించిన నారాయణ చొరవపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సమస్యల పరిష్కారమే ప్రజావేదిక లక్ష్యం

## ప్రజాదర్బార్‌లో వినతి పత్రాలు స్వీకరించిన మంత్రి పయ్యావుల కేశవ్



అనంతపురం, (చైతన్యరథం): ఉరవకొండ నియోజకవర్గ పరిధిలోని ఉరవకొండ మండలం కౌకుంట్ల గ్రామంలోని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రివర్యుల క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించి నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వివిధ రకాల సమస్యలపై మంత్రి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేసిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తమకూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. తమ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. ఇందులో వచ్చిన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు నలుమూలల నుంచి వచ్చిన బాధితులు, నాయకులు, ప్రజలు సమస్యలను అర్జీల రూపంలో స్వీకరించడం జరిగిందని, ఎలాంటి ఆలస్యం కాకుండా ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.



పలమనేరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

# మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే కాకర్ల ఆర్థిక సహాయం

ఉదయగిరి, (చైతన్యరథం): వరికుంటపాడు మండలం రొంపి దొడ్ల గ్రామంలో ఇద్దరు యువకులు ఆదివారం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ గురై మృతి చెందారు. ఈ వార్తను విన్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గారు హుటాహుటిన వారి నివాసాలకు బయలుదేరి వెళ్లారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, కాకర్ల ట్రస్టు ద్వారా ఇద్దరికీ చెరోక 50 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని వెనువెంటనే అందించారు. ప్రభుత్వం ద్వారా సమకూరే ఆర్థిక సహాయాన్ని కూడా తక్షణమే అందిస్తామని తెలిపారు.సంబంధిత అధికారులకు ఈ విషయాన్ని తెలియజేసి, ఇరువురు యువకుల కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం అందించాలని ఆయన ఆదేశించారు. ఉదయగిరి నియోజకవర్గంలో ఏ ఘటన జరిగిన వెనువెంటనే స్పందించి, బాధితులను మానవత దృక్పథంతో ఆదుకుంటున్న కాకర్ల సురేష్ పనితీరు పట్ల నియోజకవర్గం ప్రజలు హర్షమ్ వ్యక్తం చేస్తున్నారు. బాధల్లో ఉన్న వారిని నేనున్నానంటూ, ఆయన ఆదుకునే తీరు ప్రశంసనీయమని వారు అంటున్నారు. నియోజకవర్గంలో పలు కార్యక్రమాలకు ఎమ్మెల్యే సురేష్ కాకర్ల ట్రస్ట్ ద్వారా నిధులను ఉదారంగా అందిస్తున్నారు.



# విద్యార్థులే నవభారత నిర్మాతలు

## గణతంత్ర దినోత్సవంలో టీడీపీ నేత రామకృష్ణారెడ్డి

మంత్రాలయం, (చైతన్యరథం): మంత్రాలయం మండలం మాధవరం గ్రామ హైస్కూల్లో దేశ గౌరవాన్ని ప్రతిబింబించే గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగుదేశం పార్టీ మంత్రాలయం ఇన్చార్జి ఎన్.రాఘవేంద్ర రెడ్డి సోదరుడు మంత్రాలయం సొసైటీ చైర్మన్ ఎన్.రామకృష్ణ రెడ్డి గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పావురాలను ఆకాశంలోకి ఎగరవేసి దేశ శాంతి, ఐక్యతకు ప్రతీకగా సందేశం ఇచ్చారు.అలాగే వివిధ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేసి ప్రోత్సహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లోనే ఉందని, క్రమశిక్షణ, విద్యతోనే నిజమైన గణతంత్ర విలువలు నిలబడతాయని" తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు,విద్య



కమిటీ చైర్మన్ గ్రామ పెద్దలు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# ప్రధాని ప్రశంసలందుకున్న రాయదుర్గం నగరవనం

## కష్టానికి తగిన గుర్తింపు దక్కిందని ఎమ్మెల్యే కాలవ హర్షం

రాయదుర్గం, (చైతన్యరథం): "మన్ కీ బాత్" లో ప్రధాని నరేంద్ర మోడీ రాయదుర్గం నగరవనాన్ని ప్రశంసించటం పట్ల ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హర్షం వ్యక్త పరిచారు. తమ శ్రమకు తగిన గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీకి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రాయదుర్గం నియోజకవర్గ కూటమి నాయకులు మీడియా ప్రతినిధులు, పట్టణ ప్రముఖులతో కలసి సోమవారం ఆయన రాయదుర్గం నగరవనాన్ని సందర్శించారు. గత తెలుగుదేశం పార్టీ పాలనలో అక్కడ చేపట్టిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ, 2026 సంవత్సరంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదివారం నిర్వహించిన తొలి "మన్ కీ బాత్" కార్యక్రమంలో అనంతపురం జిల్లాలో జల సంరక్షణకు చేపడుతున్న కార్యక్రమాలను వివరిస్తూ... రాయదుర్గం నీటి సంరక్షణలో ఆదర్శంగా నిలిచిందని, నగరవణాన్ని ఉద్దేశిస్తూ ప్రశంసించడం మనందరికీ గర్వకారణమన్నారు. అనంతపురం జిల్లా ప్రజల పక్షాన, కూటమి పార్టీల పక్షాన ప్రధానికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు. గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ పాలనలో 2014-19 మధ్యన తన విజ్ఞప్తి మేరకు అప్పటి అటవీ శాఖ మంత్రి బొజ్జల గోపాలకృష్ణరెడ్డి రాయదుర్గం నగరవణాన్ని మంజూరు చేశారన్నారు. 50 హెక్టార్ల విస్తీర్ణంలో దీన్ని అభివృద్ధి చేయటానికి అనుమతులు ఇచ్చారన్నారు. జల సంరక్షణ కార్యక్రమాలు, పట్టణ ప్రజలకు వినోదాన్ని పరిచే కార్యక్రమాలు, చిన్నపిల్లల ఆడుకోవడానికి తగిన వసతులు కల్పిస్తామన్నారు. భవిష్యత్తులో ఇక్కడ వసతి కూడా కల్పించాలన్నది తన సంకల్పమని త్వరలోనే దాన్ని కూడా నెరవేరుస్తామన్నారు. పర్యావరణ హితాన్ని కోరుకునే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, అట్లాగే పచ్చదనాన్ని పెంచడానికి నిర్విరామంగా కృషి చేస్తున్న నాయకుడు పవన్ కళ్యాణ్ సహకారంతో ఈ నగరవణాన్ని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దుతామన్నారు. 2014-19 మధ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణకు పచ్చదనాన్ని పెంచడానికి భూగర్భ జలాల సంరక్షణకు చంద్రబాబునాయుడు ప్రభుత్వం ఎంతగానో కృషి చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 10 లక్షల పంటకుంటలు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకోగా అందులో ఆరు లక్షల పంట కుంటలు అనంతపురం జిల్లాలోనే నిర్మించడం జరిగిందన్నారు. దాదాపు రూ.213 కోట్లు జిల్లాలో జల సంరక్షణ కోసం ఉపాధి హామీ నిధులను ఖర్చు పెట్టినట్లు వివరించారు. వాటితో 30వేలకు పైగా నీటి సంరక్షణ స్ట్రక్చర్స్ నిర్మించామని దాంతో నేడు జిల్లాలో 10.56 మీటర్ల లోతులో భూగర్భ జలం లభ్యమవుతున్నాయన్నారు. అయితే వర్షాకాలంలో ఐదు మీటర్ల లోతులో, ఎండా కాలమైతే ఎనిమిది మీటర్ల లోతులో నీరు లభ్యమయ్యేలా ఉండాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని వివరించారు. ఆయన ఆశయానికి అనుగుణంగా పనులు వేగంగా జరుగుతుండగా... 2019లో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి భూగర్భ జలాల గురించి పట్టించుకోక పోవడంతో పచ్చదనము కనుమరుగైపోయిందని ఆందోళన వ్యక్తపరిచారు. చంద్రబాబు నాయకత్వంలో ఏడాదిన్నర కిందట ఏర్పాటైన కూటమి ప్రభుత్వం మళ్లీ పర్యావరణ పరిరక్షణ, జల సంరక్షణ పనులను వేగవంతం చేసిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆశీస్సులతో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శనంలో, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో కూటమి పార్టీల నాయకులందరూ కలసికట్టుగా పని చేస్తామని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, మండల కన్వీనర్ కురుబ హనుమంతు, మోహన్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంత రెడ్డి, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ మంజునాథ, అధికార ప్రతినిధి పసుపులేటి నాగరాజు, పద్మశాలి డైరెక్టర్ పోరాళ్ల పురుషోత్తం, బిజెపి నాయకులు వసుంధర దేవి, ఆంబోజి రావ్, హీరోజి రావ్, బుదురు తిప్పేస్వామి, రావుత్ రాజశేఖర్, ఎల్లప్ప, భలే శంకర్, ఇనాయత్, తదితరులు పాల్గొన్నారు.







# అంబరాన్నంటిన గణతంత్ర సంబరాలు

## పాల్గొన్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, శుభాంశు శుక్లాకు అశోక చక్ర ప్రదానం

దేశ రాజధాని దిల్లీలో గణతంత్ర వేడుకలు అంబరాన్నంటాయి. ఉదయం 10.30 గంటలకు కర్తవ్యపథ్ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సైనిక దళాల కవాతు ప్రారంభమైంది. అపాచీతో పాటు ప్రచండ్ తేలికపాటి హెలికాప్టర్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పోరులో ధరించే దుస్తులతో అశ్వికదళం తొలిసారి ఈ పరేడ్లో పాల్గొంది. ఐరోపా సమాఖ్యకు చెందిన సైనిక విభాగం కూడా ప్రదర్శనలిచ్చింది. దేశ అభివృద్ధి ప్రస్థానం, సాంస్కృతిక వైవిధ్యం, సైనిక బలం, ఆపరేషన్ సిందూర్లో వాడిన ప్రధాన ఆయుధ వ్యవస్థలు వంటివి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకలకు యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్డెర్ లేయెన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ వేడుకలను వీక్షించేందుకు వేలాది మంది విచ్చేశారు.

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)ను సందర్శించిన తొలి భారతీయుడిగా రికార్డుకెక్కిన వ్యోమగామి గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అత్యున్నత శౌర్య పురస్కారం 'అశోక చక్ర'ను ప్రదానం చేశారు. భారత్ సొంతంగా చేపట్టబోయే మానవసహిత అంతరిక్ష యాత్ర గగన్యాన్కు ఎంపికైన మరో వ్యోమగామి గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్కు రెండో అత్యున్నత శౌర్య పురస్కారం 'కీర్తి చక్రను అందజేశారు.



# ఘనంగా గణతంత్ర వేడుకలు

## ఆకర్షణీయ దుస్తుల్లో, ప్రధాని మోదీ, ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు లేయన్

దేశ రాజధానిలో, గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ. ధరించిన తలపాగా అందరి దృష్టినీ ఆకర్షించింది. అలాగే ఈ వేడుకలకు ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్ లేయన్ భారతీయత ఇలా డ్రెస్ ధరించారు. ప్రధాని మోదీ ప్రకాశవంతమైన ఎరుపు, పసుపు, ఆకు పచ్చ, పంగపండు రంగులు కలగలిసిన తలపాగాను ధరించారు. జరీతో చేసిన బంగారు రంగు దుస్తుల వస్త్ర ధారణ ఆకర్షణీయంగా కనిపించింది. రాజస్థానీ సంప్రదాయ తలపాగా.. పండగ వాతావరణాన్ని ప్రతిబింబించింది. అందులోని ఎరుపు అభిరుచి ధైర్య సాహసాలకు నిదర్శనంగా చెప్తారు. అలాగే ముదురునీలం, తెలుపు రంగుల్లో ఉన్న కుర్తా పైజామా ధరించారు. పైన లేత నీలంలో ఉన్న జాకెట్ వేసుకున్నారు. మరోవైపు ఊదా మెరూన్ రంగులో గోల్డ్ డిజైన్ చేసిన డ్రస్ ధరించాడు. ఆమె సాధారణంగా ధరించే ప్యాంటూ భిన్నంగా ఈ దుస్తులు వేసుకున్నారు. ఐరోపా కమిషన్కు తొలి మహిళా అధ్యక్షురాలు. 2019లో తొలిసారి బాధ్యతలు చేపట్టిన ఆమె 2004లో రెండోసారి ఎన్నికయ్యారు. 2029 వరకు ఈ బాధ్యతల్లో కొనసాగుతారు. అంతకు ముందు ఆమె 2005 నుండి 2019 వరకు జర్మనీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. ఈ పర్యటనలో భాగంగా ఆమె ఇండియా, ఈయు సదస్సులో పాల్గొన్నారు. మరోవైపు భారత్, ఐరోపా యూనియన్ మధ్య స్వేర్యా వాణి ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్నాయి. ఈ పర్యటనలో ఆ ఒప్పందం జరిగే అవకాశం ఉంది.

# ఇక బద్రీనాథ్, కేదార్నాథ్ ఆలయాల ప్రవేశం హిందువులకే

## బద్రీనాథ్, కేదార్ నాథ్ టెంపుల్ కమిటీ ప్రతిపాదన



ఉత్తర భారతంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన బద్రీనాథ్, కేదార్నాథ్ ఆలయాల్లోకి ఇకపై హిందువులను మాత్రమే అనుమతించనున్నారు. ఈ ఆలయాల్లోకి హిందూయేతరుల ప్రవేశంపై నిషేధం విధించాలని బద్రీనాథ్-కేదార్ నాథ్ టెంపుల్ కమిటీ ప్రతిపాదించింది. త్వరలో జరగబోయే ఆలయ కమిటీ బోర్డు సమావేశంలో ఈ ప్రతిపాదనలను ఆమోదించనున్నారు. ఈ విషయాన్ని బద్రీనాథ్-కేదార్నాథ్ ఆలయ కమిటీ ఛైర్మన్ హేమంత్ ద్వివేది ధ్రువీకరించారు. ఈ రెండు ఆలయాలతో పాటు కమిటీ పరిధిలోకి వచ్చే మిగతా దేవాలయాల్లోనూ ఇదే ప్రవేశ నిబంధన వర్తించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే గంగోత్రి థామ్లోకి హిందూయేతరులు ప్రవేశించకుండా నిషేధం విధించారు. ఈ మేరకు ఆదివారం జరిగిన శ్రీ గంగోత్రి టెంపుల్ కమిటీ సమావేశంలో దీనిపై ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలోనే బద్రీనాథ్, కదార్నాథ్ ఆలయ ప్రవేశాల పైనా ప్రతిపాదనలు వచ్చాయి. అయితే, ఈ కొత్త నిబంధనలు ఎప్పటినుంచి అమల్లోకి తెస్తారన్న విషయాన్ని మాత్రం ఇంకా నిర్ణయించలేదు. ఉత్తరాఖండ్లోని చార్థామ్ యాత్రలో భాగమైన ఈ ఆలయాలను ఏటా లక్షలాది మంది భక్తులు సందర్శిస్తారు. శీతాకాలం నేపథ్యంలో ఆరు నెలల పాటు మూసి ఉంచిన బద్రీనాథ్ ఆలయ ద్వారాలను ఏప్రిల్ 23న తెరవనున్నారు. ఇక, గంగోత్రి, యమునోత్రి ఆలయాలు అక్షయ తృతీయను పురస్కరించుకుని ఏప్రిల్ 19న తెరుచుకోనున్నాయి.





# గణతంత్ర కవాతులో ఘనత వహించిన మహిళా కమాండెంట్ సిమ్రన్ బాలా

కర్తవ్యపథ్లో జరిగిన గణతంత్ర వేడుకల పరేడ్లో 26 ఏళ్ల సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సిమ్రన్ బాలా ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గణతంత్ర దినోత్సవ కవాతులో పారామిలిటరీ దళానికి చెందిన పురుషుల బృందానికి ఆమె నాయకత్వం వహించి, చరిత్ర సృష్టించారు. దేశంలోనే అతిపెద్ద పారామిలిటరీ దళానికి చెందిన 147 మంది పురుష సిబ్బంది బృందాన్ని ఆమె ముందుండి నడిపారు. కర్తవ్యపథ్ ఫోర్స్ బ్యాండ్ వాయించిన 'దేశ్ కే హమ్ హై రక్షక్ అనే సీఆర్పీఎఫ్ గీతానికి అనుగుణంగా బృందం కవాతు చేసింది. గణతంత్ర పరేడ్లోని బృందాలకు గతంలోనూ సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్కు చెందిన అధికారిణులు నాయకత్వం వహించినప్పటికీ. పూర్తిస్థాయిలో పురుషుల బృందానికి ఓ మహిళ నాయకత్వం వహించడం ఇదే మొదటిసారి. జమ్మూకశ్మీర్లోని రాజౌరీలో పాక్ సరిహద్దుకు 11 కిలోమీటర్ల దూరంలోని నౌషెరా గ్రామంలో జన్మించిన సిమ్రన్ జమ్మూలోని గాంధీనగర్లో ఉన్న ప్రభుత్వ మహిళా కళాశాల నుంచి రాజకీయ శాస్త్రంలో పట్టభద్రురాలయ్యారు. ఏడాది కిందటే సీఆర్పీఎఫ్ దళంలో చేరారు. ఆ జిల్లా నుంచి పారామిలిటరీ దళంలో ఆఫీసర్ హోదాలో చేరిన మొదటి మహిళగా ఆమె చరిత్ర సృష్టించారు.

# భారత విశ్వరూప సాక్షాత్కారం

దేశ రాజధాని దిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకలు మన సైనిక బలగాల సత్తాను చాటాయి. కర్తవ్యపథ్లో జరిగిన ఈ వేడుకల పరేడ్లో 'ఆపరేషన్ సిందూర్లో వాడిన పలు స్వదేశీ ఆయుధ వ్యవస్థల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తొలిసారి 'బ్యాటిల్ అరే ఫార్మాట్లో మన సైన్యం ఈ కవాతులో పాల్గొంది. అంటే యుద్ధ క్షేత్రంలో పాల్గొంటున్నట్లుగా మన ఆయుధాలు, నిఘా వ్యవస్థలు, బలగాలను ఈ పరేడ్లో ప్రదర్శించారు.'ఆపరేషన్ సిందూర్' థీమ్తో రూపొందించిన భారత సైన్యం శకటం మరింత ఆకట్టుకుంది. త్రివిధ దళాల సమన్వయం ఎంత శక్తిమంతంగా ఉంటుందో చాటిచెప్పేలా దీన్ని రూపొందించారు. బ్రహ్మోస్, ఆకాశ్ ఆయుధ వ్యవస్థలు, 300కిలోమీటర్ల దూరం వరకు






లక్ష్యాలను ఛేదించగలిగే 'సూర్యాస్త్ర' రాకెట్ లాంఛర్ వ్యవస్థ, యుద్ధట్యాంకు అర్జున్ వంటివి ఈ పరేడ్లో ప్రదర్శించారు. కొత్తగా ఏర్పడిన భైరవ్ లైట్ కమాండో బెటాలియన్, శక్తిబన్ రెజిమెంట్, రెండు మూపురాల ఒంటెలు, జన్స్కార్ గుర్రాలు వంటివి తొలిసారిగా కవాతులో పాల్గొన్నాయి. పోరులో ధరించే దుస్తులతో అశ్విక దళం కనువిందు చేసింది. అపాచీతో పాటు ప్రచండ్ తేలికపాటి హెలికాప్టర్లు, నాగ్ క్షిపణి వ్యవస్థలు, ధనుష్ తుపాకులు, డ్రోన్లను ఈ పరేడ్లో ప్రదర్శించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో వినియోగించిన ఎస్-400 క్షిపణి వ్యవస్థ ఆకట్టుకుంది. మరోవైపు, గగనతలంలో యుద్ధ విమానాలు వివిధ ఆకృతుల్ని ఏర్పరిచాయి. ధ్రువ్ చాపర్ 'సిందూర్' జెండాతో కనిపించింది.

# చైనా అణు రహస్యాలు లీక్?

**- టాప్ జనరల్‌పై దర్యాప్తు**



అగ్రరాజ్యం అమెరికాకు చైనా అణు రహస్యాలు లీక్ చేశారనే కారణంతో ఓ శక్తివంతమైన అధికారిపై దర్యాప్తు జరుగుతోందని సమాచారం. ఈ వార్త ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు సన్నిహితుడైన జనరల్ జాంగ్ యూక్సియా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీలో అత్యున్నత స్థాయి అధికార హోదాలో ఉన్నారు. చైనా సెంట్రల్ మిలిటరీ కమిషన్ వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఇటీవల జాంగ్‌పై అమెరికా పత్రిక వాల్‌స్ట్రీట్ జర్నల్ సంచలన కథనం ప్రచురించింది.

చైనా అణ్వాయుధ ప్రోగ్రామ్‌కు సంబంధించిన కీలక టెక్నికల్ డేటాను జనరల్ జాంగ్ అమెరికాకు లీక్ చేశారని ఆ కథనంలో ఆరోపించింది. అలాగే చైనా మిలిటరీ విభాగానికి సంబంధించి ప్రమోషన్ల విషయంలో కూడా జాంగ్ భారీగా లంచాలు తీసుకున్నా రని, ఆయుధ పరికరాల కొనుగోళ్లలో అవినీతికి పాల్పడ్డారని పేర్కొంది. ఈ విషయం బయటపడడంతో ఆయనపై చైనా రక్షణ మంత్రిత్వ శాఖ ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించిందని తెలిపిం ది. ప్రస్తుతం జాంగ్‌పై దర్యాప్తు జరుగుతున్నట్టు వాషింగ్టన్‌లోని చైనా ఎంబసీ అధికార ప్రతినిధి వెల్లడించినట్టు వాల్‌స్ట్రీట్ పేర్కొం ది. ఈ కథనం తర్వాత సోషల్ మీడియాలో మరిన్ని ఆరోపణలు షికార్లు చేస్తున్నాయి. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు వ్యతిరేకంగా సైనిక తిరుగుబాటుకు జాంగ్ ప్రయత్నం చేశారని, దీంతో జాంగ్‌తో పాటు మరికొందరు సీనియర్ జనరల్స్‌ను నిర్బంధించా రని వార్తలు వస్తున్నాయి. అయితే ఈ వార్తలపై చైనా ప్రభుత్వం యంత్రాంగం ఇప్పటివరకు స్పందించలేదు.

# ఫిలిప్పీన్స్‌లో మేయర్‌పై రాకెట్ దాడి..

**ప్రాణాలు కాపాడిన ఆర్మర్డ్ వాహనం**



ఫిలిప్పీన్స్‌లోని మగుఇండనావో డెల్ సుర్ ప్రావిన్స్‌లోని షరీఫ్ అగ్వాక్ పట్టణ మేయర్ అక్మద్ మిత్రా అంపటువాన్పై లక్ష్యంగా ఆదివారం ఉదయం ఓ భయంకరమైన దాడి జరిగింది. దుండ గులు ఆర్‌పీజీ-7(రాకెట్-ప్రొపెల్డ్ గ్రెనేడ్)తో మేయర్ వాహనాన్ని టార్గెట్ చేశారు. కానీ ఆయన ఆర్మర్డ్ టొయోటా ల్యాండ్ క్రూజర్ వాహనం దాని ప్రభావాన్ని తట్టుకుని ముందుకు సాగడంతో మేయర్ సురక్షితంగా తప్పించుకున్నారు.

**దాడి ఎలా జరిగింది?**

సీసీటీవీ ఫుటేజీ దృశ్యాల ఆధారంగా.. జనవరి 25న(స్థానిక సమయం ప్రకారం ఆదివారం) ఉదయం సుమారు 6:30 ప్రాంతంలో బరాంగే పోబ్లాసియన్‌లోని మగుఇండనావో స్ట్రీట్ - మేయర్ స్థానిక మార్కెట్ నుంచి ఇంటికి తిరిగి వెళ్తుండగా.. ఒక వైట్ మినివాన్ నుంచి ఇద్దరు దుండగులు దిగారు. వారిలో ఒకరు ఆర్‌పీజీ-7 ఫైర్ చేయగా, మరొకరు కాల్పులు జరిపారు. మేయర్ కాన్వాయ్‌పై డైరెక్ట్ హిట్.. ల్యాండ్ క్రూజర్ బాగా దెబ్బతిన్నా, ఆర్మర్డ్ బలంతో వాహనం ఆగకుండా ముందుకు వెళ్లింది. బ్యాకప్ వాహనానికి కూడా బుల్లెట్లు తగిలాయి. ఇద్దరు ఎస్కార్ట్ సిబ్బంది (బెంజీ డెలోస్ రేయెస్, చీఫ్ మాస్టర్ సార్జెంట్ రే విన్సెంట్ గెర్టోస్)కి గాయాలయ్యాయి. వీరికి దాటు హోఫర్ అంపటువాన్‌లోని బంగ్సమోరో రీజనల్ మెడికల్ సెంటర్‌లో చికిత్స అందిస్తున్నారు.

**ఆ తర్వాత ఏమైంది?**

దాడి జరిగిన వెంటనే ఫిలిప్పీన్ నేషనల్ పోలీస్, ఫిలిప్పీన్ ఆర్మీ(90వ ఇన్ఫాంట్రీ బెటాలియన్) కలిసి హాట్ పర్స్యూట్ ఆపరేషన్ చేపట్టాయి. దుండగుల్ని హతమార్చాయి. ఈ దాడి వెనుక ఉద్దేశమేమిటో ఇంకా తెలియరాలేదు. ఘటనపై అక్కడి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా.. మేయర్ అక్మద్ అంపటువాన్ షరీఫ్ అగ్వాక్ మీద దాడి జరగడం ఇది నాల్గవ సారి. గత ఐదేళ్లలో ఆయనపై నాలుగు సార్లు దుండగు లు హత్యాయత్నం చేశారు. ఆర్మర్డ్ ఎస్‌యూవీ బలంతోనే తన ప్రాణాలు కాపాడుకున్నానని మేయర్ అంటున్నారు.

# భారత్‌తో ఒప్పందం కుదరకపోవడానికి వారే కారణం

**రిపబ్లికన్ సెనేటర్ టెడ్ క్రజ్**



అమెరికా ప్రభుత్వం అనుసరిస్తున్న సుంకాల విధింపు విధానంపై అధికార రిపబ్లికన్ పార్టీలో అభిప్రాయభేదాలు తీవ్రమయ్యాయి. టారిఫ్‌లే కేంద్రంగా సాగుతున్న అమెరికా వాణిజ్య విధానంపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సొంత పార్టీ నేత, సెనేటర్ టెడ్ క్రజ్ విమర్శలు గుప్పించిన ఆడియో లీక్ కావడం తో ప్రస్తుతం కలకలం రేపుతోంది. భారత్‌తో వాణిజ్య ఒప్పందాన్ని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, శ్వేతసౌధం ఆర్థిక సలహాదారు పీటర్ నవారో అడ్డుకుంటున్నారని టెడ్ క్రజ్ ఆరోపించినట్టు ఓ ఆడియోను స్థానిక మీడియా సంస్థ విడుదల చేసింది. గతేడాది రిపబ్లికన్ పార్టీ దాతలతో జరిగిన సమావేశం సందర్భంగా టెడ్ క్రజ్ ఈ వ్యాఖ్యలు చేసినట్టు తెలిపింది. తాను స్వేచ్ఛా వాణిజ్యానికి మొగ్గు చూపుతానని, కానీ ట్రంప్ మంత్రి వర్గంలోని కొందరు మాత్రం ఇందుకు సుముఖంగా లేరని టెడ్ క్రజ్ చెప్పారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి కొన్ని సార్లు ట్రంప్ స్వయంగా మోకాలడ్డారని కూడా పేర్కొన్నారు. ట్రంప్ వాణిజ్య విధానంతో అమెరికా ఆర్థిక రంగం కుప్పకూలుతుందని కూడా టెడ్ క్రజ్ హెచ్చరించారు. చివరకు అమెరికా అధ్యక్షుడికి అభిశంసన ముప్పు కూడా ఎదురయ్యే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. గతేడాది ట్రంప్ సుంకాలను విధించిన సమయంలోనే తాను, కొద్ది మంది ఇతర సెనెటర్లు అధ్యక్షుడికి ఫోన్ చేసి వారించినట్టు చెప్పారు. అయితే, ట్రంప్ మాత్రం అసహనంతో తమపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారని తెలిపారు. వచ్చే ఏడాది (2026) నవంబర్ నాటికి ప్రజల పెన్షన్ ఆదాయం తగ్గినా, వస్తుసేవల ధరలు 10-20 శాతం మేర పెరిగినా ఎన్నికల్లో ఎదురుదెబ్బలు తగులుతాయని కూడా హెచ్చరించినట్టు చెప్పుకొచ్చారు. దీంతో ట్రంప్ తనపై మరింత అసహనం వ్యక్తం చేశారని తెలిపారు. భారత్‌తో ట్రేడ్ డీల్‌కు రెడీ కావాలని తాను శ్వేతసౌధంతో పోరాడానని కూడా టెడ్ క్రజ్ చెప్పుకొచ్చారు. ఈ డీల్‌ను ఎవరు వ్యతిరేకిస్తున్నారని కొందరు దాతలు ప్రశ్నించగా.. పీటర్ నవారో, వాన్స్, కొన్ని సార్లు ట్రంప్ మోకాలడ్డారని క్రజ్ తెలిపినట్టు స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

## సముద్రంలో మునిగిన నౌక..

**ఫిలిప్పీన్స్‌లో 15 మంది జలసమాధి**



దక్షిణ ఫిలిప్పీన్స్‌లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. 300 మందికి పైగా ప్రయాణికులు, సిబ్బందితో వెళ్తున్న ఒక ఫెర్రీ బోట్ (ప్యాసింజర్ నౌక) సోమవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తూ సముద్రంలో మునిగిపోయింది. ఈ ఘటనలో 15 మంది జలసమాధి అయినట్లు సమాచారం. సమాచారం అందుకున్న రెస్క్యూ టీమ్ సహాయకచర్యలు ప్రారంభించింది. ఇప్పటి వరకు 250 మందిని రక్షించినట్లు ఫిలిప్పీన్స్ కోస్ట్ గార్డ్ సోమవారం తెలిపింది. జాంబోంగా నగరం నుంచి సులు ప్రావిన్స్‌లోని జోలో ద్వీపానికి ఈ ఫెర్రీ బయలుదేరింది. బాసిలన్ ప్రావిన్స్‌లోని బలుక్‌బలుక్ ద్వీపం సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన వెంటనే ఇతర నౌకలు మత్స్యకారులు, కోస్ట్ గార్డ్ యూనిట్లు స్పందించి సహాయక చర్యలు ప్రారంభించారు. ప్రమాదానికి గల కారణం ఇంకా తెలియరాలేదని, దీనిపై దర్యాప్తు జరుపుతున్నామని అధికారులు తెలిపారు.



## భారత్‌కు ట్రంప్ గణతంత్ర శుభాకాంక్షలు

భారత 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రపంచ దేశాల నుంచి శుభాకాంక్షలు సందేశాలు వెల్లువెత్తుతున్నాయి. చైనా, రష్యా, ఫ్రాన్స్, ఈయూ, ఇరాన్, నేపాల్, ఆస్ట్రేలియా, భూటాన్ తదితర దేశాల నుంచి ఇప్పటికే శుభాకాంక్షలకు సంబంధించిన సందేశాలొచ్చాయి. భారత్‌తో బంధాన్ని మరింత బలోపేతం చేసుకుంటామని ఈ సందర్భంగా ఆయా దేశాధినేతలు,మంత్రులు పేర్కొన్నారు.ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా భారత ప్రభుత్వానికి, దేశ ప్రజలకు 77వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. న్యూఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం నుంచి ట్రంప్ పేరుతో ఈ సందేశం వచ్చింది. రెండు దేశాల మధ్య ఉమ్మడి అంశాలను హైలెట్ చేస్తూ ఇరు దేశాలు వారి ప్రజాస్వామ్య సంప్రదాయాల ద్వారా ఐక్యంగా ఉన్నాయని ట్రంప్ చెప్పారు. అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో కూడా భారత ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

## చైనాతో ఎలాంటి వాణిజ్య ఒప్పందం ఉండదు..

**స్పష్టం చేసిన కెనడా ప్రధాని**



చైనాతో వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటే కెనడాపై 100 శాతం సుంకాలు విధిస్తానన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో కెనడా ప్రధాని మార్క్ కార్నీ కీలక కామెంట్స్ చేశారు. చైనాతో ఎలాంటి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే ఆలోచన తమకు లేదని ఆదివారం స్పష్టం చేశారు. చైనాకు కెనడా దగ్గరవుతోందన్న ట్రంప్ ఆరోపణలను కూడా తోసిపుచ్చారు. కొన్ని ప్రత్యేక సుంకాల అడ్డంకులను తొలగించే దుకు ఇటీవల చైనాతో చర్చలు చేపట్టామని వివరణ ఇచ్చారు. 'సీయూఎస్ఎంఏ ఒప్పందానికి మేము కట్టుబడి ఉన్నాము. అమెరికా, మెక్సికోతో కుదుర్చు కున్న ఈ ఒప్పందం ప్రకారం, ఆ రెండు దేశాలకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఇతర దేశాలతో ట్రేడ్ డీల్స్ సాధ్యం కాదు. కాబట్టి, మాకు చైనా సహా ఇతర ఏ దేశంతోనూ వాణిజ్య ఒప్పందాలు చేసుకునే ఉద్దేశం లేదు' అని కార్నీ స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే కెనడాపై తొలుత బెదిరింపులకు దిగిన డొనాల్డ్ ట్రంప్ ఆ తరువాత కాస్త మెత్తబడ్డట్టు కనిపించారు. తాజాగా తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో చేసిన పోస్ట్‌లో కేవలం చైనాను మాత్రమే టార్గెట్ చేశారు. 'గొప్ప దేశమైన కెనడాను చైనా విజయవంతంగా తన ఆధీనంలోకి తెచ్చుకుం టున్నట్టు కనిపిస్తోంది. వాళ్లు, కనీసం ఐస్ హాకీనైనా వదిలి పెడితే బాగుండును' అని అన్నారు. చైనాతో డీల్స్ విపత్కరమని కూడా కెనడాను మరోసారి హెచ్చరించారు. కెనడా సుభిక్షంగా ఉండాలనేదే తన అభిమ తమని చెప్పుకొచ్చారు. 2024లో అమెరికాను అనుసరిస్తూ కెనడా ప్రభుత్వం చైనా కంపెనీల విద్యుత్ వాహనాలు, స్టీల్ ఉత్పత్తులపై వరుసగా 100 శాతం, 25 శాతం సుంకం విధించింది. ఇందుకు ప్రతిగా చైనా కూడా కెనడా నుంచి దిగుమతయ్యే వాటిపై సుంకాలను పెంచింది. అయితే, ఇటీవల చైనా పర్యటన సందర్భంగా కెనడా ప్రధాని చైనా ఉత్పత్తులపై సుంకాలను తగ్గించారు. చైనా కూడా కెనడా వ్యవసాయ దిగుమతులపై సుంకాలను తగ్గించింది. వాణిజ్యాన్ని స్థిరీకరించేందుకే సుంకాలను తగ్గించామని ప్రధాని కార్నీ అప్పట్లో పేర్కొన్నారు. అవధుల్లేని దిగుమతు లకు తాము ద్వారాలు తెరవలేదని కూడా స్పష్టం చేశారు.





# సెంచరీతో చెలరేగిన సీవర్.. ఆర్సీబీపై ముంబయి ఇండియన్స్ ఘన విజయం

మహిళల ప్రీమియర్ లీగ్‌లో భాగంగా వడోదర వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరుగుతున్న మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్ ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి ఇండియన్స్ భారీ స్కోరు చేసింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ముంబై జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది. వన్‌డౌన్ బ్యాటింగ్‌కు వచ్చిన నాట్ సీవర్ (100; 57 బంతులు) శతకంతో ఆకట్టుకుంది. నాట్‌తో పాటు ఓపెనర్ హేలీ మాథ్యూస్ (56; 39 బంతులు) అర్ధ శతకంతో రాణించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (20; 12 బంతుల్లో) దూకుడుగా ఆడినా చివరి వరకు క్రీజులో నిలదొక్కుకోలేకపోయింది. నాట్ సీవర్, హేలీ రెండో వికెట్‌కు 73 బంతుల్లో 131 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. ఈ జోడీని విడదీసేందుకు ఆర్సీబీ బౌలర్లు తీవ్రంగా



శ్రమించారు. శ్రేయాంక వేసిన 12వ ఓవర్‌లో నాట్ సీవర్ వరుసగా మూడు ఫోర్లు బాదింది. ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో నాలుగో బంతికి నాట్ సెంచరీ పూర్తి చేసుకుంది. ఇక ఆర్సీబీ బౌలర్లలో లారెన్ బెల్ 2 వికెట్లు సాధించింది. అలానే నదైన్ డి క్లర్క్, శ్రేయాంక పాటిల్ ఒక్కో వికెట్ పడగొట్టారు. మొత్తంగా ఆర్సీబీ ముందు 200 పరుగుల భారీ టార్గెట్‌ను ముంబై ఇండియన్స్ ఉంచింది.

**పోరాడి ఓడిన బెంగళూరు**

200 పరుగుల భారీ టార్గెట్ లక్ష్యంతో బరిలో దిగిన బెంగళూరు తొమ్మిది వికెట్లు కోల్పోయి 189 పరుగులు మాత్రమే చేసి ఓటమి చవిచూసింది. బ్యాటింగ్ ఇక ఈ మ్యాచ్ ముంబైకు చాలా కీలకమైనది. ఇందులో గెలిస్తేనే ఆ జట్టు ప్లే ఆఫ్స్ ఆశలు సజీవంగా ఉంటాయి. ఈ దశలో జట్టు ఘన విజయం సాధించి ఆశలు సజీవంగా నిలుపుకుంది. సీజన్‌లో ఇప్పటివరకు ఆరు మ్యాచ్‌లు ఆడిన ముంబై ఇండియన్స్.. రెండింటిలో మాత్రమే గెలిచింది. మిగతా నాలుగు మ్యాచ్‌ల్లో ఓడింది. మరోవైపు బెంగళూరు జట్టు ఆడిన ఆరు మ్యాచ్‌లలో ఐదు గెలిచి.. ఒకటి ఓడింది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ఆర్సీబీ మాత్రమే ప్లే ఆఫ్స్ బెర్తును ఖరారు చేసుకుంది. మిగిలిన రెండు స్థానాల కోసం తీవ్రమైన పోటీ ఉంది.



## టీమిండియా వేటాడేసింది: గవాస్కర్



గువాహటి వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20లో టీమిండియా 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న టీమిండియా.. తొలుత కివీస్ జట్టును బ్యాటింగ్‌కు ఆహ్వానిం చింది. కివీస్ నిర్ణీత 20 ఓవర్లకు 9 వికెట్లు కోల్పోయి 153 పరుగులు చేసింది. భారత బౌలర్ల ధాటికి కివీస్ బ్యాటర్లు వరుసగా పెవిలియన్ బాట పట్టారు. 154 పరుగుల విజయ లక్ష్యంతో ఛేదనకు దిగిన టీమిండియా.. 10 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి ఆటను ముగించింది. అభిషేక్ శర్మ(68; 20 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్సులు), సూర్యకుమార్ యాదవ్(57; 26 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సులు) హాఫ్ సెంచరీలతో చెలరేగారు. ఈ ఐదు టీ20ల సిరీస్‌లో వరుసగా మూడు మ్యాచుల్లో విజయం సాధించిన టీమిండియా.. 3–0తో సిరీస్ ను కైవసం చేసుకుంది. భారత బ్యాటర్ల విధ్వంసంపై టీమిండియా క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ స్పందించాడు. అద్భుతంగా ఆడారంటూ కొనియాడాడు. 'కేవలం బ్యాటింగ్ మాత్రమే కాదు. బౌలింగ్, ఫీల్డింగ్, క్యాచింగ్ బాగుంది. టీమిండియా ఆటతీరు అమోఘం. ఏదైనా జట్టు ఈ మ్యాచ్‌ను చూస్తుంటే.. భారత్‌ను ఎలా ఎదుర్కోవాలా అని ఆలోచిస్తుంది. భారత్ విజయాన్ని చూసి ప్రత్యర్థి జట్లు భయపడాల్సిందే. అంత వేగంగా హాఫ్ సెంచరీ సాధించడం చాలా కష్టం. కానీ చాలా మ్యాచుల్లో అభిషేక్ శర్మ చేసి చూపిస్తున్నాడు. ఒకసారి 14 బంతుల్లో అర్ధశతకం చేస్తే.. మరోసారి 16 బంతుల్లో సాధించా డు. అతడు ఏదో ఒకరోజు కచ్చితంగా యువరాజ్ సింగ్ ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ రికార్డ్‌ను బ్రేక్ చేస్తాడు. అప్పుడు అందరికంటే ఎక్కువ యువీనే ఆనందిస్తాడు' అని సునీల్ గవాస్కర్ అన్నాడు.

# ప్రతిదాంట్లో మీ జోక్యం ఎందుకు?

### పీసీబీ చైర్మన్ నఖ్వీపై భజ్జీ ఫైర్



టీ20 ప్రపంచ కప్ 2026 సమరం ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం కానుంది. ఈ టోర్నీ నుంచి బంగ్లాదేశ్‌ను తప్పించి స్కాట్లాండ్‌ను రీప్లేస్ చేస్తున్నట్లు ఐసీసీ ఇటీవలే అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. బంగ్లా ఆటగాడు ముస్తాఫిజుర్ రెహమాన్‌ను ఐపీఎల్ 2026 నుంచి రిలీజ్ చేయడంపై తీవ్రంగా స్పందిస్తూ.. తాము కూడా భారత్‌లో ఆడేందుకు రాబోమని బీసీబీ తేల్చి చెప్పింది. దీనికి పాకిస్తాన్ కూడా మద్దతు ప్రకటించింది. అవసరమైతే తాము కూడా ఈ టోర్నీ నుంచి నిష్క్రమిస్తామని పీసీబీ ఛైర్మన్ నఖ్వీ వెల్లడించాడు. ఈ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన ఐసీసీ.. పీసీబీకి చురకలు అంటించడంతో వెనక్కి తగ్గి పాకిస్తాన్ జట్టును ప్రకటించింది. ఈ వివాదాల నడుమ టీమిండి యా మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ నఖ్వీపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశాడు. 'ఈ టోర్నీలో ఆడటం, ఆడకపోవడం అంతా బంగ్లాదేశ్ సమస్య.. పాకిస్తాన్‌ది కాదు. అవసరం లేని చోట ఎందుకు మీ జోక్యం బంగ్లాదేశ్‌తో కలిసి భారత్‌పై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేశారు. ఇదంతా మురికి నీటిలో చేపలు పట్టే ప్రయత్నం అంటారు. టోర్నీ నుంచి తప్పుకునే ఆలోచనలు ఉన్నట్టు మీరు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు నీరుగారిపోయాయి. ఇన్ని వివా దాల నడుమ నష్టపోయేది మాత్రం బంగ్లా ఆటగాళ్లే.ఓ ప్రపంచ కప్‌లో ఆడే అవకాశం కోల్పోవడం చిన్న విషయం కాదు. ఆటగాళ్ల కెరీర్‌లపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుంది'అని భజ్జీ వెల్లడించాడు.

**ఇదంతా 'ఈగో'..**

'బంగ్లా ఆటగాడిని ఇక్కడ ఆడించలేదని.. వారి జట్టు మొత్తాన్నే భారత్‌కి పంపడానికి నిరాకరించారు. ఇక్కడ బంగ్లా క్రికెట్ బోర్డు వ్యవహార శైలే పద్ధతిగా లేదు. దేనికైనా చర్చల ద్వారానే పరిష్కారం వెతకాలి. కానీ వారు నేరుగా 'భారత్‌కు రాం' అని చెప్పడం తప్పు. ఇది ఈగో సమస్యగా మారింది. భారత పిచ్‌లపై బంగ్లా స్పిన్న ర్లకు మంచి అవకాశాలుండేవి. ఇంగ్లండ్ లేదా ఆస్ట్రేలియాలో అయితే వారికి కష్టమయ్యేది. ఇక్కడ అయితే రెండో రౌండ్‌కి చేరి కొన్ని సంచలనాలు సృష్టించే అవకాశం కూడా ఉండేది. ఈ రాజకీయ ఒత్తిళ్లు ఆటగాళ్ల కెరీర్‌పై ప్రభావం పడేలా చేశాయి' అని హర్భజన్ అభిప్రాయం వ్యక్తం చేశాడు.

## విజయ్ అమృత్‌రాజ్‌కు పద్మ భూషణ్

### రోహిత్, హర్మన్, సవితలకు పద్మశ్రీ



న్యూఢిల్లీ: దిగ్గజ టెన్నిస్ ఆటగాడు విజయ్ అమృత్‌రాజ్‌కు ప్రతిష్ఠాత్మక పద్మభూషణ్ అవార్డు దక్కింది. అలాగే క్రికెటర్లు రోహిత్ శర్మ, హర్మన్‌ప్రీత్ కౌర్‌లకు పద్మశ్రీ పురస్కారం లభిం చింది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్రం ఆదివారం పద్మ అవార్డులను ప్రకటించింది. దేశ అవార్డుల్లో మూడో అత్యున్నతమైన పద్మభూషణ్ ఈసారి క్రీడారంగం నుంచి విజయ్ అమృత్‌రాజ్‌ను వరించింది. అమృత్‌రాజ్‌కు 1983లో పద్మశ్రీ, అంతకుముందు 1974లో అర్జున పురస్కారాలు ప్రదా నం చేశారు. ఇక రోహిత్ శర్మ తన సారథ్యంలో 2024 టీ20 వరల్డ్ కప్‌ను భారత్‌కు అందించాడు. అలాగే గత ఏడాది హిట్‌మ్యాన్ కెప్టెన్సీలో టీమిండియా 50 ఓవర్ల చాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలిచింది. టెస్టులు, టీ20లకు గుడ్‌బై చెప్పిన రోహిత్ ప్రస్తుతం వన్డేలలో మా త్రమే కొనసాగుతున్నాడు. అలాగే గత సంవత్సరం హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలో మహిళల జట్టు వన్డే వరల్డ్ చాంపియన్‌గా ఆవిర్భవించింది. పారా ఒలింపి క్స్ హైజంప్‌లో పసిడి పతకం సాధించిన ప్రవీణ్ కుమార్, భారత మహిళా హాకీ జట్టు గోల్ కీపర్ సవితా పూనియా, హాకీ వెటరన్ కోచ్ బల్‌దేవ్ సింగ్, సంప్రదాయ యుద్ధ విద్య సిలంబట్టమ్ కోచ్ పజనివేల్ (పుదుచ్చేరి), బుందేలి యుద్ధ కళ కోచ్ భగవాన్ దాస్ రైక్వార్ (మధ్యప్రదేశ్)లకు పద్మశ్రీ ప్రకటిం చారు. జార్జియాకు చెందిన దివంగత రెజ్లింగ్ కోచ్ వ్లాదిమిర్? మెస్త్ విర్షివిలీను మరణానంతరం పద్మశ్రీకి ఎంపిక చేశారు. పదేళ్లపాటు భారత రెజ్లింగ్ కోచ్‌గా పనిచేసిన వ్లాదిమిర్ యోగేశ్వర్ దత్, బజ్‌రంగ్ పూనియాకు శిక్షణ ఇచ్చాడు.

## పాక్ మాజీ క్రికెటర్ అఫ్రిది వక్ర బుద్ధి

### మరోసారి భారత్‌పై అక్కసు - ఐసీసీ నిర్ణయంపై అసంతృప్తి



పాక్ పాలకులకు నిద్రలేచింది మొదలు పడుకునే వరకు భారత్‌పై అక్కసు వెళ్లగక్కుతూనే ఉంటారు. ఆ దేశ క్రికెటర్లు, మాజీ ఆటగాళ్లు సైతం టీమిండియాపై తమ అసూయను వ్యక్తం చేస్తుంటారు. తాజాగా పాక్ మాజీ క్రికెటర్ షాహిద్ అఫ్రిది సైతం తన వక్రబుద్ధిని చూపించాడు. భారత్‌పై మరోసారి తన అక్కసు బయటపెట్టాడు. టీ20 ప్రపంచకప్ 2026 నుంచి తప్పుకున్న బంగ్లాదేశ్ అంశంలో భారత్‌ను లాగి తన వక్రబుద్ధిని చాటుకు న్నాడు. భద్రతను సాకుగా చూపుతూ ఇండియాలో మ్యాచ్‌లు ఆడమని ఓవరాక్షన్ చేసిన బంగ్లాదేశ్ స్థానంలో స్కాట్లాండ్‌కు ఐసీసీ అవకాశమివ్వడాన్ని అతడు తప్పుబ ట్టాడు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా భారత్, పాకిస్థాన్ లో పర్యటించని అంశాన్ని ఈ సందర్భంగా అతడు గుర్తు చేశాడు. 'ఓ అంతర్జాతీయ క్రికెటర్‌గా ఐసీసీ చర్యలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాను. గతంలో భద్రత కారణాల వల్ల పాకిస్థాన్‌లో పర్యటిం చడానికి భారత్ ఒప్పుకోలేదు. దీన్ని ఐసీసీ సమర్థించింది. కానీ..ఇప్పుడు అదే అంశంపై బంగ్లా విషయంలో మాత్రం భిన్నంగా ప్రవర్తించింది' అని అఫ్రిది సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. పాకిస్థాన్ లాంటి దేశం, అఫ్రిది లాంటి వారి చెప్పుడు మాటలు వినడం కారణంగానే బంగ్లాదేశ్‌కు ఈ గతి పట్టిందని సోషల్‌మీడియాలో పలువురు కామెంట్స్ చేస్తున్నారు. బంగ్లాకు జరిగిన ఆర్థిక నష్టాన్ని పాక్ తీరుస్తుందా అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు.

చైతన్య రథం సినిమా

మంగళవారం 27 జనవరి 2026

# ఉస్తాద్ భగత్‌సింగ్‌పై అంతటా ఉత్కంఠ

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన "ఉస్తాద్ భగత్ సింగ్" ఉత్కంఠ రేపుతోంది దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కిస్తున్న సాలిడ్ మాస్ ఎంటర్టైనర్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే ఈ సినిమా నుంచి వచ్చిన పోస్టర్లు, రీసెంట్ సాంగ్ ఫ్యాన్స్‌లో మంచి జోష్ నింపాయి. ఇవి కాకుండా తాజాగా ఓ సరికొత్త పోస్టర్‌ని కూడా మేకర్స్ వదిలారు.

## వచ్చే మార్చిలో విడుదలకు సన్నాహాలు

తన ఉస్తాద్ భగత్ సింగ్ తో కలిసి హరీష్ శంకర్ చెయ్యెత్తిన పిక్ తో మేకర్స్ ఈ రథ సప్తమి కానుకగా విడుదల చేశారు. మరి ఇందులో పవన్ కళ్యాణ్ తన మార్క్ స్టైలిష్ లుక్ లో కనిపిస్తుండగా హరీష్ శంకర్ ఒక పెద్ద పండుగని తెస్తున్నారు అంటూ ప్రామిస్ చేస్తున్నారు. అలాగే అప్డేట్స్ కూడా త్వరలోనే మొదలు పెడుతున్నట్టు కన్ఫర్మ్ చేశారు. ఇక ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తున్నారు. అలాగే ఈ మార్చిలోనే రిలీజ్‌కి సన్నాహాలు చేస్తున్నారు.



# మాస్‌రాజా రవితేజ సినిమా పేరు ఇరుముడి




మాస్ రాజా రవితేజ రీసెంట్‌గా 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అనే కామెడీ ఎంటర్‌టైనర్‌తో సంక్రాంతి బరిలో దిగాడు. ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి మిక్సిడ్ రెస్పాన్స్ లభించింది. ఇక ఈ సినిమా తర్వాత రవితేజ ఇప్పుడు తన నెక్స్ట్ చిత్రాలపై ఫోకస్ పెట్టాడు. జనవరి 26న పుట్టినరోజు జరుపుకున్న రవితేజ అభిమానులకు ఓ గుడ్ న్యూస్ చెప్పాడు. తన నెక్స్ట్ చిత్రానికి 'ఇరుముడి' అనే టైటిల్‌ను ఫిక్స్ చేసి ఫస్ట్ లుక్ పోస్టర్?ను కూడా రిలీజ్ చేశారు. దర్శకుడు శివ నిర్వాణ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమలో రవితేజ పాత్ర అల్టిమేట్‌గా ఉండబోతుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఇక ఈ సినిమా సెట్స్‌లో రవితేజ పుట్టినరోజు సెలబ్రేషన్స్‌ను చిత్ర యూనిట్ నిర్వహించింది. రవితేజ కేక్ కట్ చేసి తన బర్త్ డే సెలబ్రేట్ చేసుకున్నాడు. దీనికి సంబంధించిన ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ సినిమాలో ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా డైలాగ్ కింగ్ సాయి కుమార్, బేబి నక్షత్ర తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ ప్రొడ్యూస్ చేస్తున్నారు.

# తెల్లవారి గుండెల్లో దడ పుట్టించే రణబాలి

## సెప్టెంబర్ 11న విడుదల

రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ, దర్శకుడు రాహుల్ సాంకృత్యాన్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పీరియాడిక్ చిత్రం వీడీ14 అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా నుంచి రిపబ్లిక్ డే సందర్భంగా టైటిల్ గ్లింప్స్‌ను మేకర్స్ తాజాగా రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో 1876 కాలంనాటి పరిస్థితులను మనకు చూపెట్టబోతున్నారు. ఆ సమయంలో బ్రిటిష్ వారు భారతీయులపై చేస్తున్న అకృత్యాలను ఓ యోధుడు ఎలా ఎదిరించాడు అనే నేపథ్యంలో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. రణబాలి అనే పవర్‌ఫుల్ పాత్రలో విజయ్ దేవరకొండ ఈ సినిమాలో కనిపిస్తున్నాడు. ఇక బ్రిటిష్ వారిని అతడు ఏ విధంగా ఎదురించి పోరాటం చేశాడు అనేది మనకు ఈ సినిమాలో చూపించబోతున్నాడు దర్శకుడు రాహుల్ సాంకృత్యాన్. ఈ సినిమాలో నేషనల్ క్రష్ రష్మిక మందన్న జయమ్మ అనే పాత్రలో నటిస్తుండగా హాలీవుడ్ మూవీ 'మమ్మీ' చిత్రంలో విలన్‌గా నటించిన ఆర్నాల్డ్ వోస్లూ ఈ సినిమాలో బ్రిటిష్ అధికారిగా తన క్రూరత్వాన్ని చూపించబోతున్నాడు. ఇక ఈ సినిమాకు బాలీవుడ్ ద్వయం అజయ్, అతుల్ సంగీతం అందిస్తుండగా మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఇక ఈ చిత్రాన్ని 2026 సెప్టెంబర్ 11న వరల్డ్‌వైడ్‌గా గ్రాండ్ రిలీజ్ చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు.







# ఓటీటీలో శంబాల జోరు

## ఐదు రోజులకే హొరెత్తిన సత్తా

విలక్షణ నటుడు ఆది సాయి కుమార్ హీరోగా షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందిన డిఫరెంట్ హారర్ ఎంటర్‌టైనర్ 'శంబాల' కు యగంధర్ ముని దర్శకత్వం వహించారు. రాజశేఖర్ అన్నభిమోజు, మహీధర్ రెడ్డి నిర్మాతలు. ఐతే, ఈ సినిమా ఈ నెల 21న ఆహాలో ప్రీమియర్ అయింది. కాగా, ఈ చిత్రం ఓటీటీలో చాలా త్వరగా ప్రజాదరణ పొంది, కేవలం 5 రోజుల్లోనే 5 కోట్ల స్ట్రీమింగ్ నిమిషాలను నమోదు చేసింది. మరి రాబోయే రోజుల్లో ఈ సినిమా ఇంకెంత ఆదరణ పొందుతుందో చూడాలి. ఇదిలా ఉండగా, ఓటీటీలో దీని హిందీ వెర్షన్ కోసం ఇంకా ఎదురుచూపులు కొనసాగుతున్నాయి. ఈ సినిమాలో స్వాసిక విజయ్, మధునందన్, రవి వర్మ లక్ష్మణ్ మీసాల కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రానికి శ్రీచరణ్ పాకాల సంగీతం అందించారు. మొత్తానికి ఈ 'శంబాల' చిత్రం ఒక డీసెంట్ డివోషనల్ అండ్ సైన్స్ మిక్స్ థ్రిల్లర్‌గా సాగింది.

# అమెరికాలోనూ అదే.. జోరు!

## హొరెత్తుతున్న అనగనగా ఒకరోజు

యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో నవీన్ పొలిశెట్టి హీరోగా హీరోయిన్ మీనాక్షి చౌదరి కాంబినేషన్‌లో దర్శకుడు మారి తెరకెక్కించిన సాలిడ్ ఎంటర్టైనర్ చిత్రమే 'అనగనగా ఒక రాజు. ఈ సంక్రాంతి కానుకగా థియేటర్లలో రిలీజ్‌కి వచ్చిన ఈ సినిమా నవీన్ కెరీర్‌లోనే రికార్డు గ్రాసర్‌గా నిలిచింది. ఇక ఈ సినిమా తెలుగు స్టేట్స్‌లోనే కాకుండా యూఎస్ మార్కెట్‌లో కూడా మంచి వసూళ్లు రాబడుతూ దూసుకెళ్తుంది. లేటెస్ట్‌గా నార్త్ అమెరికాలో ఈ సినిమా 1.7 మిలియన్ డాలర్స్ మార్క్‌ని క్రాస్ చేసినట్టు మేకర్స్ కన్ఫర్మ్ చేశారు. మరి లాంగ్ రన్ లో 2 మిలియన్ మార్క్ పై ఈ సినిమా కన్నేసింది అనుకోవచ్చు. సో ఈ సినిమా ఆ మార్క్‌ని రీచ్ అవుతుందో లేదో చూడాలి. ఇక చిత్రంలో రావు రమేష్, చమ్మక్ చంద్ర తదితరులు నటించగా మిక్కీ జే మేయర్ సంగీతం అందించారు. అలాగే సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ వారు నిర్మాణం వహించారు.



# పరుగులెడుతున్న ది ప్యారడైజ్ చిత్రీకరణ

## పెరుగున్న భారీ అంచనాలు

నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న 'ది ప్యారడైజ్' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'దసరా' భారీ విజయాన్ని అందుకోవడంతో, ఈ మాస్ ఎంటర్టైనర్‌పై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. సుధాకర్ చెరుకూరి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రంపై రోజురోజుకీ ఆసక్తి పెరుగుతోంది. ఈ సినిమాలో ఒక పవర్?ఫుల్ పాత్ర ఉండబోతోందని, అది ప్రేక్షకులను విస్మయానికి గురిచేస్తుందని సమాచారం. సీనియర్ నటుడు తనికెళ్ల భరణి ఈ కీలక పాత్రను పోషిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం, ఆయన ఈ చిత్రంలో పవర్?ఫుల్ విలన్ గా కనిపించబోతున్నారని, తన అనుభవంతో ఆ పాత్రను మరో స్థాయికి తీసుకెళ్లారని టాక్ వినిపిస్తోంది.ఈ చిత్రంలో కయాదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, కలెక్షన్ కింగ్ మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు.

